TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

www.telanganamuchatlu.in

వరంగల్ సంపుటి : 2 సంచిక : 43 శుక్రవారం 8 - 11 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in






### 11 నెలల్లోనే ప్రభుత్వంపై

# తీవ్ర వ్యతిరేకత

- పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా పరిస్థితి
- ధాన్యం కొనే దిక్కులేక రైతుల అవస్థలు
- దళారుతలో కుమ్మక్కయిన మిల్లర్లు
- సంస్థాగతంగా బిజెపి బలోపేతం చేయాలి
- ప్రజల సమస్యలపై ఎక్కడిక్కడ పోరాటాలు
- పార్టీ కార్యశాలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




హైదరాబాద్,నవంబర్7 : రాష్ట్రంలో 11 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారని వివరించారు. అలాగే ఆరు గ్యారెంటీల అమలులో విఫలం అయ్యారని అన్నారు. సంస్థాగతంగా భాజపాను బలోపేతం చేసుకోవాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల పక్రియపై కార్యశాల నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయని చెప్పారు. భాజపాకు సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. మహిళ, యువత, రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సంస్థాగత ఎన్నికలకు తెలంగాణ బీజేపీ సిద్ధం అవుతుంది.. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నేటితో మెంబర్ షిప్ డ్రైవ్ చివరి దశకు చేరుకుంది. బూత్ , మండల, జిల్లా కమిటీల ఎన్నికలపై మార్గనిర్దేశర నిర్వహించేందుకు సిద్దమైంది బీజేపీ. బూత్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ పై చర్చ నిర్వహిస్తున్నారు ఈ నెల 15 నుండి 25

2లో

# ఎవరీ కశ్యప్ పటేల్..

## ట్రంప్‌కు ఎలా నమ్మకస్తుడిగా మారారు



వాషింగ్టన్, **నవంబర్ 7 :** అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి కశ్యప్ పటేల్ ఎవరు? అనే ప్రశ్న ఎక్కువగా వినిపిస్తోంది. త్వరలోనే అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్.. కశ్యప్ పటేల్‌కు కీలకమైన సీఐఏ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించవచ్చంటూ కథనాలు వెలువడుతుండడంతో ఆయన గురించి ఆరా తీసేవారి సంఖ్య పెరిగింది. ముఖ్యంగా భారతీయులు ఆయనకు సంబంధించినవివరాలను అన్వేషి స్తున్నారు. కశ్యప్ పటేల్ గుజరాతీ కుటుంబానికి చెందినవారు. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. 1970 దశ కంలో ఉగాండాలో ఇడి అమీన్ ప్రభుత్వం ఉన్న సమయంలో అమెరికాకు పారిపోయారని మీడియా కథనాలు చెబుతు న్నాయి. కశ్యప్ పటేల్1980లో గార్డెన్ సిటీ న్యూయార్క్‌లో పుట్టి పెరిగారు. హిందువుగా పెరిగారు. రిచ్‌మండ్ విశ్వ విద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్

2లో

### కేసీఆర్ ఆనవాళ్లను

# చెరిపేసే ప్రయత్నం

## - విద్యార్థుల జీవితాలతో సీఎం రేవంత్ చెలగాటం : కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 7 : కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే ప్రయత్నంలో విద్యార్థుల ప్రాణాలతో రేవంత్ సర్కార్ చెలగాటమాడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌పై కక్షగట్టి గురుకుల, ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా అని ప్రశ్నించారు. వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నా సర్కార్ ఏం చేస్తున్నదని నిలదీశారు. విద్యార్థుల అవస్థలు రేవంత్ రెడ్డి కంటికి కనిపించడం లేదా అని, నిమ్స్ లో పేద పిల్లల హాహాకారాలు వినిపించడం లేదా మండిపడ్డారు. పది రోజులుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు నిత్యకృత్యమై పేదల పిల్లలు గోడుగోడునా ఏడుస్తుంటే కనీసం సమీక్ష అయినా నిర్వహించావా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. విద్యాశాఖను అంటిపెట్టుకొని 11 నెలల్లో మీరు పీకిందేమిటని మండిపడ్డారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులను అవస్థలకు గురిచేశారన్నారు. గురుకులాలకు తాళం పడేలా చేశారని, ప్రాథమిక పాఠశాలలకు శీతాకాలంలోనే ఒంటిపూట పెట్టారని దుయ్యబట్టారు. సకల జనులను కాంగ్రెస్ పార్టీ కన్నీళు పెట్టిస్తున్నదని విమర్శించారు. మార్పుకు ఓటేసిన ఫలితం తెలంగాణను వెంటాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పలికిమాలిన పాలనలో పల్లె, పట్టణ ప్రగతి లేదు : కేటీఆర్**

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమంతో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారిపోయాయి. తెలంగాణ తొలి పాలకుడి

2లో

## గాయ్...గాయ్

# గత్తర చేస్తున్న రేవంత్

## ఎక్స్ వేదికగా హరీశ్‌రావు విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 7 : సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న వాస్తు మార్పులపై మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రీన్ టెక్నాలజీ, ఫైర్ సేఫ్టీ నార్మ్స్‌తో దేశానికే తలమానికమైన కొత్త సెక్రటేరియట్ నిర్మిస్తే వాస్తు పిచ్చని నాడు రేవంత్ రెడ్డి గాయ్ గాయ్ గత్తర గత్తర చేసిండు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా సెక్రటేరియట్‌కు పూటకో మార్పు చేస్తున్నాడని ఎద్దేవా చేశాడు.వాస్తు దోషం ఉందని ఒక్క గేట్ మార్పు చేయటానికి రూ.4 కోట్లు ఖర్చు పెడుతున్నారని ఇది కదా అసలు సిసలైన కాంగ్రెస్ మార్కు మార్పు అని ఎక్స్ వేదికగా స్పందించారు. ఇకనైనా పాలనపై దృష్టి పెట్టి ప్రజలకు మేలు జరిగే పనులు చేపట్టాలని హితవు పలికారు.

## రేవంత్ రెడ్డి ఒకే ఒక్కడు - పుస్తకాన్ని ఆవిష్కరించిన పిసిసి చీఫ్

హైదరాబాద్, నవంబర్ 7: సీఎం రేవంత్ రెడ్డి పై రాసిన ఒకే ఒక్కడు పుస్తకాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కూమార్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విలక్షణమైన నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న వయసులో రాజకీయాల్లో డైనమిక్ లీడర్ గా ఎదిగిన వ్యక్తీ రేవంత్ రెడ్డి అని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన

2లో

### తెలంగాణలో


# పలువురు డీఎస్పీల బదిలీ

హైదరాబాద్, నవంబర్ 7 : తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు.అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పీ.సదయ్యను బదిలీపై హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని డీజీపీ కోరారు. ప్రస్తుతం వనపర్తి డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఇక తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వీ సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా ఉన్న డీ.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌పర్ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.

## కులగణన సర్వేలో అంతా పాల్గొనాలి: మంత్రి సీతక్క

హైదరాబాద్,నవంబర్7 : రాష్ట్రంలో ప్రారంభమైన కులగణన సర్వేలో ప్రజలంతా పాల్గొనాలని, ఊరూరా ఉత్సాహంగా, ఉద్యమంగా కార్యక్రమం సాగాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆకాంక్షించారు.దేశంలో కులగణనకు మొదటి అడుగు తెలంగాణలో పడిందని, దీంతో ప్రజల

2లో



### వ్యాపారానికి కాదు..

# గుత్తాధిపత్యానికి వ్యతిరేకం

## బిజెపి విమర్శలపై రాహుల్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ,నవంబర్7 : తాను వ్యాపార వ్యతిరేకిని కాదని, కేవలం గుత్తాధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకిస్తానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

2లో

# సంపాదకీయం

## భారత్‌తో బంధం బలపడేనా ?

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ మరోమారు ఎన్నిక కావడంతో..ఇప్పుడు మనదేశం కోణంలో చూస్తే సంబంధాలు బలంగానే ఉండే అకాశం ఉంది. ట్రంప్‌తో ప్రధాని మోడీకి మధ్య మంచి మిత్రుత్వం ఉన్న కారణంగా ఆశాజనకంగా ఉంటుందన్న అంచనాలు మొదలయ్యాయి. అయితే ప్రధానంగా హెచ్-1 వీసాలు, గ్రీన్ కార్డులు, ఉద్యోగావకాశాలు వంటి వాటిపైనే యువత దృష్టి సారిస్తోంది. నిజానికి ఇప్పుడు ఉద్యోగ భద్రత అన్నది అమెరికాలో లేకుండా పోయింది. ఏ రోజు ఎవరిని ఊడబెరుకుతారో అన్నది సమస్యగా మారింది. ఈ అంశాల్లో మోడీ కూడా ట్రంప్‌తో అమరమరికలు లేకుండా మాట్లాడాలి. అమెరికాకు మళ్లీ స్వర్ణయుగాన్ని తీసుకువస్తానని అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే చెప్పారు. నిజానికి రాజకయిాంగా మార్పు జరిగి నప్పుడు ప్రపంచంలో ఏ దేశంలో అయినా కొత్త ఆశలు పుట్టుకుని వస్తాయి. అగ్రరాజ్యం అమెరికాలో కూడా ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. ఈ రాజకీయ మార్పు అమెరికాను మళ్లీ గొప్పదిగా చేసేందుకు దోహదం చేయగలిగితే..అది ప్రపంచ దేశాలపైనా ప్రభావంచూపుతుంది. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్లు నిర్వహించిన ప్రచారం అతిపెద్ద రాజకీయ ఉద్యమంగానే చూడాలి. బైడెన్ వయసు మీద పడడంతో సరిగ్గా నిర్ణయాలు తీసుకోలేక పోయారు. అలాగే కమలా హారిస్ కూడా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ధృఢమైన నిర్ణయాలకు అడుగువేయలేక పోయారు. ఇది ఓ రకంగా సగటు అమెరికన్లను కలచి వేసిందనే చెప్పాలి. అందుకే గతంలో ఎప్పుడూ లేనంతగా అమెరికా గతంలో ఎన్నడూ చూడని విజయాన్ని ట్రంప్ చేజిక్కించుకున్నారు. అందువల్ల ఈ విజయానికి మరింత ప్రాముఖ్యత ఉంది. అమెరికా ను బలంగా, సురక్షితంగా, సుసంపన్నంగా చేసేవరకు విశ్రమించబోనని కూడా ట్రంప్ ప్రకటించారు. దేశాన్ని తీర్చిదిద్దే ప్రయత్నంలో, తన కర్తవ్య నిర్వహణలో ప్రజలంతా చేతులు కలపాలని కోరుతున్నట్లుగా కూడా ట్రంప్ ప్రకటించారు. అమెరికా చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు ఏకపక్షంగా ట్రంప్ విజయానికి దోహదపడ్డారు. భిన్నమైన సంస్కృతులు నేపథ్యాలున్నవారు ఉమ్మడి లక్ష్యాల కోసం ఏకతాటిపైకి రావడం చరిత్రాత్మకం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు పూర్తిచేయడంలో ఏ శక్తీ తనను ఆపజాలదని ట్రంప్ కూడా ధృడంగానే ఉన్నారు. అసలైన అమెరికన్లకు దేశంలో ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయనీ, అమెరికా ఉత్పత్తుల అమ్మకాలకు అన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయన్నదే ట్రంప్ నినాదం. తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు కూడా ఆయన ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ట్రంప్ పదేపదే చెబుతు న్నట్లుగా.. అమెరికా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు కారణం నాలుగు దశాబ్దాలుగా ఆ దేశ పాలకులు అనుసరించిన విధానాలేనని చెప్పవచ్చు. అలాగని అమెరికా మీద ఆధారపడ్డ ఇతర దేశాల వారిని చులకన చేయడం కూడా మంచిది కాదు. అన్ని దేశాల ఆర్థిక విధానాలను నయానా భయాన సరళీకరించి విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేలా చేసింది అమెరికా విధానకర్తలే. 1990ల నుంచి బాగా ఊపందుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక దశ దాటిన తర్వాత అవసరమైన స్థాయిలో అమెరికన్ యువతకు ఉద్యోగాలను సృష్టించలేదు. ఈ రంగంలో కూడా చౌకగా లభ్యమయ్యే ఆసియా నిపుణులే ఎక్కువగా లబ్ది పొందారు. ఇటీవల వచ్చిన కృత్రిమ మేధో సాంకేతిక పరిజ్ఞానం కూడా ఊడిపోయే ఉద్యోగాలతో పోల్చితే సృష్టి అయ్యే ఉద్యోగాల సంఖ్య తక్కువే. కోవిడ్ అనంతరం ఐటీ రంగంలో హేమాహేమీలు అనదగిన కంపెనీలు కూడా పోటీలు పడి ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రధానంగా మధ్యతరగతి శ్వేత జాతీయులను ఆకర్షించడమే లక్ష్యంగా చేసుకుని రాజకీయాలను మొదలుపెట్టారు. మొదటిదఫా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడేనాటికే ఆ దిశలో అడుగులు వేసి విజయం సాధించారు. శ్వేతజాతి మధ్యతరగతికి ఉద్యోగ అవకాశాలు దక్కకపోవటానికి విదేశాలే కారణమని దుమ్మెత్తిపోశారు. తన ఉత్పత్తులతో అమెరికా మార్కెట్‌ను ముంచెత్తిన చైనాతో మొదలుపెట్టిన రాజకీయయుద్ధంలో అవసరమను కున్న చోట భారత్‌నీ లాగారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ విపరీతంగా దిగుమతి సుంకాలు విధిస్తోందని విరుచుకుపడ్డారు. తాజా ఎన్నికల్లో అయితే మంచి జీతాలుండే ఉద్యోగాలన్నిటినీ భారతీయులు కొట్టేస్తున్నారనీ ఆక్షేపించారు. వివిధ రంగాల్లో అమెరికా ఆధిపత్యం తగ్గటానికి, ఉద్యోగాల క్షీణతకు ఇతర దేశాల చర్యలే కారణమన్నట్లుగా ఆయన చేసిన ప్రచారానికి లక్ష్యం శ్వేత జాతీయులను ఆకర్షించడమే. అమెరికా జనాభాలో 60 శాతానికి కాస్త అటుఇటుగా ఉన్న శ్వేతజాతీయులను తనవైపు తిప్పుకోవటంలో మొదటిసారిలాగే రెండోసారి ట్రంప్ విజయం సాధించారు. శ్వేతజాతీయుల ఆధిపత్యానికి ముప్పు ముంచు కొస్తుందనే ఒకరకమైన భయాన్ని, ఆందోళనను కలిగించటంలో ట్రంప్ సఫలీకృతమయ్యారు. ఉద్యోగ భద్రతను, ఉద్యోగ కల్పనను తగినంత ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థ అభద్రతా సమాజాన్ని సృష్టిస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల్లో మార్పుని చూడటం సహజం. కానీ ట్రంప్‌ని నిశితంగా చూసిన వారెవరూ ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని భావించటం లేదు.


# ప్రజల అవసరాలు, పెరుగుతున్న ట్రాఫిక్ కు అనుగుణంగా రోడ్ల అభివృద్ధి

## -రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ప్రజల అవసరాల మేరకు, పెరుగుతున్న ట్రాఫిక్ కు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేసుకుంటున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బోనకల్ మండల కేంద్రంలో పర్యటించి బోనకల్ నుండి ఆళ్లపాడు రోడ్డు వరకు ఎస్టీ.ఎస్.డి.ఎఫ్. నిధులు 15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ, పటిష్టపరుచు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎక్కువ కాలం, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా నాణ్యతగా రోడ్డు పనులు చేపట్టాలని, ప్రజల అవసరాలకు తగ్గట్లుగా, పెరుగుతున్న ట్రాఫిక్ కు అనుగుణంగా జిల్లాలో రోడ్ల నిర్మాణం, వెడల్పు, పటిష్టపరిచే కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు మంత్రి పొంగులేటి ఆశీర్వాదం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం నగరంలోని రోటరీనగర్ కి చెందిన మాదాల వెంకట రామకృష్ణ కుమార్తె వివాహం స్థానిక ఎస్ ఆర్ గార్డెన్స్ లో గురువారం రాత్రి జరిగింది. ఈ వివాహ వేడుకకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా అందించారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు.

# వ్యాపారానికి కాదు.. గుత్తాధిపత్యానికి వ్యతిరేకం

పేర్కొన్నారు. తనను వ్యాపార వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందన్నారు. అందుకే 'ఓ విషయంపై స్పష్టతనివ్వాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. వ్యాపారంలో గుత్తాధిపత్యం కారణంగా మిగతా వారు అవకాశాలు కోల్పోతారని అన్నారు. భాజపా లోని కొందరు వ్యక్తులు నన్ను వ్యాపార వ్యతిరేకిగా చిత్రీకరిస్తున్నారు. ఉద్యోగాల కల్పన, వ్యాపారానికి, ఆవిష్కరణలకు, పోటీతత్వానికి మద్దతు ఇస్తానని అన్నారు. నేను వ్యాపార వ్యతిరేకిని అస్సలే కాదు. గుత్తాధిపత్యానికి, మార్కెట్ నియంత్రణ శక్తులకు వ్యతిరేకం అన్నారు. కేవలం వేళ్ల సంఖ్యలో వ్యక్తులు ఆధిపత్యం చెలాయించడానికి తాను పూర్తిగా విరుద్ధం అన్నారు. మేనేజిమెంట్ కన్సల్టెంట్‌గా నా కెరీర్‌ను ప్రారంభించా. వ్యాపార విజయానికి అవసరమైన అంశాలను అర్థం చేసుకోగలను' అని పేర్కొంటూ సోషల్ మీడియాలో రాహుల్ గాంధీ ఓ వీడియో పోస్టు చేశారు. దేశంలో కొందరు వ్యాపారవేత్తలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారని ఇటీవల ఓ ఆంగ్ల వార్తా పత్రికకు రాసిన వ్యాసంలో రాహుల్ పేర్కొన్నారు. మార్కెట్‌ను నియంత్రిస్తున్న అటువంటి శక్తుల వల్ల అనేక వ్యాపారాలు క్షీణించాయని, ఉద్యోగాల సృష్టి కూడా కష్టమయ్యిందని అభిప్రాయపడ్డారు. అనేకమంది యువ వ్యాపారవేత్తలు ఇటువంటి గుత్తాధిపత్యాన్ని చూసి భయపడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. దీనిపై భాజపా నుంచి విమర్శలు వ్యక్తం కావడంతో రాహుల్ దీనిపై వివరణ ఇచ్చారు.

# 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

వరకు బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర , జిల్లా రిటర్నింగ్ అధికారుల నియామకం జరిగిన విషయం తెలిసిందే. తెలంగాణలో బీజేపీ సభ్యత్వం సుమారు 31 లక్షలు దాటిందని అంచనా వేస్తున్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం లోనే అతి పెద్ద పార్టీ బీజేపీ అన్నారు. రెగ్యులర్ గా సంస్థాగత ఎన్నికల నిర్వహించుకుంటున్న పార్టీ బీజేపీ అని తెలిపారు. తెలంగాణ లో సుమారు 35 లక్షలు చేరుకుందని అన్నారు. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందన్నారు. వివిధ స్థాయిల్లో బీజేపీ కమిటీల్లో 30శాతం కొత్త వారికి అవకాశం ఇచ్చారని తెలిపారు. బూత్ నుండి జాతీయ స్థాయి వరకు సమర్థులైన వారితో కమిటీ వేసినట్లు వెల్లడించారు. బీజేపీలో కొత్త వారిని చేర్పించాలని, భాగస్వామ్యులను చేయాలన్నారు. ఇతర పార్టీల్లో ఏమీ జరుగుతుంది తెలుసు. కుటుంబాల ఆధారంగా నడిచే పార్టీ లు అవి. ఆ పార్టీ లకి తరవాత ప్రెసిడెంట్ అవుతారో ముందే చెప్పొచ్చని తెలిపారు. బీజేపీ మాత్రం ప్రజాస్వామ్యంగా ముందుకు వెళ్తుంది? ఎవరైనా పార్టీ లో అధ్యక్షులు కావొచ్చన్నారు. ఇకపోతే తెలంగాణ పరిస్థితి పెనం నుండి పొయ్యి లో పడ్డట్టు అయిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. ఒక కొత్త పెన్షన్ ఇవ్వలేదని మండిపడ్డారు. అప్పులు మాత్రం విపరీతంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని కిషన్ రెడ్డి తెలిపారు. ఒక వైపు సంస్థాగత అంశాల పై దృష్టి పెడుతూనే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న

రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లు, మధ్య దళారులతో కుమ్మక్కు అయ్యి రైతులకు నష్టం కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ పనులు మాత్రం జరగడం లేదన్నారు. ఇక్కడ ఇచ్చిన హామీలు అమలు చేసినట్టు మహారాష్ట్రలో దుర్మార్గంగా ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు

# అతిథి అధ్యాపకుల సంఘం నూతన అధ్యక్షులు ఎన్నిక



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం లో జరిగిన జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ కొమ్ము.జాల్ అభిజిత్ దేవ్ , డాక్టర్ రాజు రెడ్డి లు పాల్గొన్నారు. వారి సమీక్షంలో జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షులుగా పేరెల్లి శ్రీను , కార్యదర్శిగా కొమ్ము. నవీన్ కుమార్,కోశాధికారిగా వి.పుల్లారావు లు ఎన్నికైనారు. అదేవిధంగా జిల్లా ఉపాధ్యక్షులుగా కొమ్మినేని. వీరన్న , జిల్లా సంయుక్త కార్యదర్శులు సిహెచ్ రాజేష్ కుమార్ , డి.కోటేశ్వరరావు , జిల్లా కోశాధికారి వి.పుల్లారావు , జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కె.శైలజ , వై. శ్రీనివాసరావు , బి. కోటేశ్వరరావు , కే.వాణి , కే. శేఖర్ లను కూడా ఎన్నుకున్నారు . అనంతరం వచ్చిన జిల్లా అతిథి అధ్యాపకులు వారందరినీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు .

## రేవంత్ రెడ్డి ఒకే ఒక్కడు - పుస్తకాన్ని ఆవిష్కరించిన పిసిసి చీఫ్

చేస్తున్న కేసీఆర్ పైన పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒకే ఒక్కడు పుస్తక ఆవిష్కరణ చేసుకున్నామని తెలిపారు. ఒకే ఒక్కడు పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్ రెడ్డి, విజయార్కేకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటి నుంచి ముందుగా రేవంత్ రెడ్డికీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డి నిండు నూరేళు ళ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని .. ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

## కులగణన సర్వేలో అంతా పాల్గొనాలి: మంత్రి సీతక్క

స్థితిగతులు తెలుస్తాయని చెప్పారు. ప్రతీ ఒక్కరు తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలను నమోదు చేసుకోవాలని, తద్వారా అన్ని రంగాల్లో అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందని సీతక్క తెలిపారు.

# కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే ప్రయత్నం

ఆశయాలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ నీరుగార్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ పనికిమాలిన పాలనలో పల్లె ప్రగతి లేదు.. పట్టణ ప్రగతి లేదని విమర్శించారు. ముందుచూపు లేని ముఖ్యమంత్రితో రాష్ట్రానికే అతీగతీ లేదని దుయ్యబట్టారు. 'పల్లె ప్రగతి' వల్ల మొన్నటి దాకా మురిసిన పల్లెలు.. నేడు మురికి కూపాలను తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతితో పరుగులు తీసిన పట్టణాలు, నేడు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయని ఫైరయ్యారు. ఒకప్పుడు పల్లె కన్నీరు పెడుతుంది అని పాడుకున్నాం.. ఇప్పుడు పట్టణాలు విలవిలలాడుతు న్నాయని బాధపడే దుస్థితి దాపురించిందని విమర్శించారు. ఈ మార్పు మాకొద్దు అనే నినాదం మొదలైందని, కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలించే రోజు దగ్గరపడిందని ఎక్స్ వేదికగా చెప్పారు.

# ఎవరీ కశ్యప్ పటేల్..

పూర్తి చేశారు. యూకేలోని యూనివర్సిటీ కాలేజ్ లండన్ ఫ్యాకల్టీ ఆఫ్ లాస్‌లో ఇంటర్నేషనల్ లా సర్టిఫికెట్ పొందారు. అనంతరం న్యూయార్క్‌కు తిరిగి వెళ్లారు.ప్రస్తుత రక్షణ కార్యదర్శి క్రిస్టోఫర్ మిల్లర్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా కశ్యప్ పటేల్ గతంలో పనిచేశారు. అంతకంటే ముందు నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో కౌంటర్ టెర్రరిజం సీనియర్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఐఎస్ఐఎస్‌తో పాటు అల్-బగ్దాదీ, ఖాసిమ్ అల్-రిమీ వంటి అల్-ఖైదా నాయకులను అంతమొందించడంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. అనేక ప్రధాన ప్రాధాన్యత కార్యకలాపాల్లోనూ ఆయన భాగస్వామిగా ఉన్నారు. అనేక మంది అమెరికన్ బందీలను స్వదేశానికి తిరిగి రప్పించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్‌గా, హౌస్ పర్మనెంట్ సెలెక్ట్ కమిటీ ఆన్ ఇంటెలిజెన్స్‌కు సీనియర్ న్యాయవాదిగా కూడా కశ్యప్‌పటేల్‌పనిచేశారు. 2016 అధ్యక్ష ఎన్నికలను రష్యా ప్రభావితం చేసిందనే ఆరోపణలపై దర్యాప్తునకు సారథ్యం కూడా వహించారు. అంతకుముందు పబ్లిక్ డిఫెండర్‌గా న్యాయవాద వృత్తిని ప్రారంభించి స్టేట్,ఫెడరల్‌కోర్టులలోఅనేకక్లిష్టమైన కేసులను విచారించారు. "ట్రంప్‌కోసంఏదైనాచేసేవ్యక్తి"గాకశ్యప్‌పటేల్‌నుఅభివర్ణిస్తుంటారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

## జ్వరాల నొప్పులతో బాధపడుతున్నారా

# అయితే ఈ సమాచారం మీ కోసమే

ఇటీవల వచ్చిన జ్వరాలు, వాటి వల్ల వచ్చే నొప్పులు, మరియు దానివల్ల కలిగే ఇతర ఆరోగ్య సమస్యలపై శ్రేష్ట హాస్పిటల్ డాక్టర్ ఎండి జనరల్ మెడిసిన్ కిలారి సునీల్ తో ముఖాముఖి తెలంగాణ ముచ్చట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో చీఫ్ షేక్ మదర్ సాహెబ్

**ప్రతినిధి: ఇటీవల వచ్చిన జ్వరాల ప్రధాన కారణాలు ఏమిటి?**

డాక్టర్: ఇటీవల వచ్చిన జ్వరాలకు ప్రధాన కారణాలు వైరల్ ఇన్ఫెక్షన్లు, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ఉన్నాయి. ఈ సీజన్లో ముఖ్యంగా వర్షాలు, గాలి మార్పు, నీటి కాలుష్యం కూడా ఇన్ఫెక్షన్లను పెంచుతాయి.

**ప్రతినిధి: ఈ జ్వరాల వల్ల శరీరంలో ఏవిధమైన నొప్పులు కలుగుతాయి?**

డాక్టర్: సాధారణంగా జ్వరాల వల్ల తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, మరియు చలి వగైరా సమస్యలు వస్తాయి. డెంగీ జ్వరం వంటి వాటిలో కీళ్ల మరియు కండరాల నొప్పులు తీవ్రమై ఉంటాయి.

**ప్రతినిధి: జ్వరాలు వచ్చినప్పుడు ఎలాంటి సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలి?**

డాక్టర్: జ్వరాల సమయంలో పుష్కలంగా నీరు తాగాలి, విశ్రాంతి తీసుకోవాలి, తేలికపాటి ఆహారం తీసుకోవాలి, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే విధంగా ఫ్లూయిడ్స్ ఎక్కువ తీసుకోవడం మంచిది. అలాగే, డాక్టర్ సూచించిన మందులు మాత్రమే తీసుకోవాలి.

**ప్రతినిధి: జ్వరాల వల్ల వచ్చే నొప్పుల్ని తగ్గించేందుకు ఎలాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి?**

డాక్టర్: సాధారణంగా, నొప్పులు తగ్గించేందుకు డాక్టర్ సూచించే ప్యారాసెటమాల్ లేదా యాంటీ ఇన్ఫ్లమేటరీ మందులు వాడవచ్చు. కానీ వైద్యులు సూచించిన మేరకు మాత్రమే తీసుకోవాలి. అలాగే, వేడినీటితో కాపడం పట్టడం కొంత ఉపశమనం కలగవచ్చు.

**ప్రతినిధి: డెంగీ వంటి వైరల్ ఫీవర్లతో వచ్చే తీవ్రమైన నొప్పులు ఉన్నప్పుడు ఎలాంటి ప్రత్యేక చికిత్సలు ఉంటాయి?**

డాక్టర్: డెంగీ వంటి సందర్భాల్లో ప్రతిసారి నొప్పులకు మందులు ఇవ్వడం మంచిది కాదు. డెంగీ కోసం ప్రత్యేక చికిత్సలు లేవు కానీ, శరీరంలో ద్రవాల బ్యాలెన్స్ ఉండేలా చూడాలి. నొప్పులను తగ్గించడానికి డాక్టర్ సూచించిన విధంగా మాత్రమే మందులు వాడాలి.

**ప్రతినిధి: జ్వరాలు రాకుండా ఉండటానికి ఎలాంటి ప్రివెన్షన్ మెజర్స్ తీసుకోవాలి?**

డాక్టర్: ముఖ్యంగా నీటి పరిశుభ్రతను పాటించాలి, మోస్కిటోలను నివారించే చర్యలు తీసుకోవాలి, సీజనల్ ఇన్ఫెక్షన్స్ కోసం ముందస్తు జాగ్రత్తగా వ్యాక్సినేషన్స్ తీసుకోవాలి. జలుబు లేదా దగ్గు ఉన్నవారితో కాంటాక్ట్ తగ్గించడం కూడా మంచిది.

**ప్రతినిధి: ఇంట్లో ఉన్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుంది?**

డాక్టర్: ఇంట్లో ఉన్నవారు అధిక జ్వరం ఉన్నవారితో ఎలాంటి కాంటాక్ట్ లేకుండా ఉండాలి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. శరీరం వేడిగా ఉన్నవారికి సాధ్యమైనంత వరకూ ఫ్లూయిడ్స్ ఇవ్వడం. జ్వరం వచ్చినప్పుడు తడిగడ్డ పెట్టి తుడవటం వంటి నార్మల్ రెమెడీస్ ను పాటించవచ్చు.

**ప్రతినిధి: రీ కరెంట్ ఫీవర్ (పున: జ్వరాలు) వస్తే ఏమి చేయాలి?**

డాక్టర్: రీ కరెంట్ ఫీవర్ వస్తే వైద్యుడు దగ్గరికి వెళ్లి పూర్తిగా టెస్టులు చేయించుకోవాలి. కొన్ని సందర్భాల్లో రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు చేసి జ్వరానికి మూల కారణం కనుగొనేందుకు అవసరమౌతుంది.

**ప్రతినిధి: పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు ప్రత్యేకంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?**

డాక్టర్: పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు వేడినీటి చికిత్సలు (తక్కువ ఉష్ణోగ్రత కలిగిన నీటి తో) కడిగించడం, పుష్కలంగా నీరు తాగించడం, మరియు తేలికపాటి ఆహారం ఇవ్వడం ముఖ్యమైనవి. తగిన సమయంలో వైద్యుడు సూచించిన ప్యారాసెటమాల్ డోస్ ఇవ్వాలి. నిత్యం పరిశుభ్రత పాటించడమే కాకుండా, వైరల్ ఇన్ఫెక్షన్లను తగ్గించేందుకు పుట్టెడు సదుపాయాలు తీసుకోవాలి.

**ప్రతినిధి: ఇంట్లో జ్వరాలకు సహాయకంగా ఉండే ప్రాథమిక చికిత్సలు ఏమిటి?**

డాక్టర్: ఇంట్లో ఉండే సహజ చికిత్సలు, ఉదాహరణకు తులసి ఆకులు, అల్లం, మిరియాలు కలిపిన కషాయం తాగడం, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, కండరాల నొప్పులు ఉన్నప్పుడు తేమతో నాటి ఉపశమనం పొందడం వంటివి ఉన్నాయి. అయితే, ఇవి ప్రాథమికంగా మాత్రమే ఉండాలి. జ్వర తీవ్రత అధికంగా ఉంటే, వైద్య సలహా అవసరం.

**ప్రతినిధి: జ్వరానికి సంబంధించి ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తారు?**

డాక్టర్: జ్వరానికి మూలకారణాన్ని తెలుసుకోవడానికి రక్త పరీక్షలు సి బి సి, యూరిన్ పరీక్షలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి ఇన్ఫెక్షన్ల స్క్రీనింగ్, మరియు ఎక్స్-రే లేదా మరిన్ని సాంప్లింగ్ టెస్టులు చేసుకోవడం అవసరం. డాక్టర్ సూచించిన విధంగా టెస్టులు చేయడం మంచిది, తద్వారా సరైన చికిత్స అందించవచ్చు.

**ప్రతినిది: జ్వరం తగ్గిన తర్వాత కూడా నొప్పులు, అలసట ఉండటం సర్వసాధారణమేనా?**

డాక్టర్: అవును, కొన్ని వైరల్ జ్వరాల తర్వాత కూడా నొప్పులు, అలసట, మలైజ్ వంటి లక్షణాలు కొన్ని వారాలు కొనసాగుతాయి. ఇది సాధారణం అయినప్పటికీ, డాక్టర్ సూచించిన ప్రకారం వ్యాయామాలు, మరియు విటమిన్లు, ముఖ్యంగా విటమిన్ బి మరియు విటమిన్ సి తీసుకోవడం ఉపశమనానికి సహకరిస్తుంది.

**ప్రతినిధి: డెంగీ మరియు ఇతర వైరల్ జ్వరాల నివారణకు ఏమి చేయవచ్చు?**

డాక్టర్: డెంగీ వంటి జ్వరాల నివారణ కోసం ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. మోస్కిటోలను నివారించే ప్రయత్నాలు చేయడం, ఇంట్లో నీటిని నిల్వ చేయకపోవడం, కిటికీలకు నెట్స్ ఉపయోగించడం, మరియు మోస్కిటో రిపెల్లెంట్లు వాడడం మంచిది. దుస్తులను పూర్తిగా కప్పేలా ధరించడం కూడా క్షీణత నివారించడానికి సహాయపడుతుంది.

**ప్రతినిధి: తక్కువ రోగ నిరోధక శక్తి ఉన్నవారికి జ్వరాలు వచ్చినప్పుడు ఎలాంటి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి?**

డాక్టర్: తక్కువ రోగ నిరోధక శక్తి ఉన్నవారు జ్వరాల వల్ల తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉంటుంది. వారు వైద్య సలహా వెంటనే పొందడం అవసరం. మంచి పోషకాహారం, సరిగ్గా విశ్రాంతి, మరియు వైద్యుడి సూచనల మేరకు మందులు వాడడం ముఖ్యమైంది.

**ప్రతినిధి: సాధారణ జ్వరం (ఫీవర్) వచ్చినప్పుడు ఇంట్లోనే ఎలా నిర్ధారించుకోవచ్చు, మరియు ఎప్పుడు డాక్టర్ ను సంప్రదించాలి?**

డాక్టర్: ఇంట్లో థర్మామీటర్ సహాయంతో జ్వరం ఉష్ణోగ్రత కొలవడం మంచిది. 100ఢీఎఫ్ లేదా అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే, జ్వరంగా పరిగణించవచ్చు. సాధారణ జ్వరం ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతే అది సాధారణంగా వ్యాధినిరోధక శక్తితో తగ్గిపోతుంది. అయితే, ఉష్ణోగ్రత 102ఢీఎఫ్ కి పైగా ఉంటే, జ్వరం మూడు రోజులు లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే, డాక్టర్‌ను సంప్రదించడం అవసరం.

**ప్రతినిధి: మలేరియా మరియు డెంగీ జ్వరాలు ఎలా భిన్నంగా ఉంటాయి, వాటికి ఎలాంటి ప్రత్యేక లక్షణాలు ఉంటాయి?**

డాక్టర్: మలేరియా జ్వరంలో ఎక్కువగా పసుపు వర్ణం, తీవ్రమైన తలనొప్పి, మరియు విపరీతమైన చెమటలు కనిపిస్తాయి. ఇది మోస్కిటోల ద్వారా వ్యాపిస్తుంది. డెంగీ జ్వరంలో తీవ్రమైన కీళ్ల నొప్పి, కండరాల నొప్పి, మరియు దద్దుర్లు రావడం కనిపిస్తుంది. డెంగీ సమయంలో ప్లేట్‌లెట్ సంఖ్య తగ్గిపోతుంది, ఇది రక్తస్రావం కలిగించే అవకాశం ఉంది.

**ప్రతినిధి: ఏ వయస్సు వారికైనా ఈ వైరల్ ఫీవర్లు తీవ్రమైన సమస్యలు కలిగించగలవా?**




డాక్టర్: సాధారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మరియు తక్కువ రోగ నిరోధక శక్తి ఉన్నవారు వైరల్ ఫీవర్ల ప్రభావానికి అధికంగా గురవుతారు. వారికి తీవ్రమైన నొప్పులు, అలసట, మరియు గుండె లేదా శ్వాస సంబంధ సమస్యలు కలగవచ్చు. అందువల్ల వారిని వైద్యుడి పర్యవేక్షణలో ఉంచడం అవసరం.

**ప్రతినిధి: అలర్జీ జ్వరాలు మరియు వైరల్ జ్వరాల మధ్య తేడా ఎలా గుర్తించాలి?**

డాక్టర్: అలర్జీ జ్వరంలో సాధారణంగా దగ్గు, జలుబు, కళ్ళకు, ముక్కుకు చిల్లు లేదా తుమ్ములు ఉంటాయి, కానీ శరీర ఉష్ణోగ్రత సరిగా ఉంటుంది. వైరల్ జ్వరంలో తలనొప్పి, శరీర నొప్పులు, మరియు కండరాల నొప్పులతో పాటు ఉష్ణోగ్రత పెరుగుతుంది.

**ప్రతినిధి: జ్వరాలకు సంబంధించిన ఎలాంటి ఆహారాలు తీసుకోవడం మంచిది?**

డాక్టర్: జ్వరం ఉన్నప్పుడు తేలికపాటి మరియు పోషక ఆహారాలు తీసుకోవడం అవసరం. పండ్లు, కాయగూరలు, పాలు, పెరుగు వంటి ఫ్లూయిడ్లు శరీరాన్ని తడబాటు లేకుండా చేస్తాయి. పొట్టకు తేలికైన భోజనం, సూప్స్, మరియు జ్వరం సమయంలో విటమిన్ సి రిచ్ పండ్లు వాడటం మంచిది.

**ప్రతినిధి: నొప్పులకు సడలించేందుకు హాట్ కాంప్రెస్ లేదా కోల్డ్ కాంప్రెస్ ఎలా ఉపయోగించాలి?**

డాక్టర్: కీళ్ల నొప్పులు, మరియు కండరాల నొప్పులు ఉన్నప్పుడు హాట్ కాంప్రెస్ చేయడం వల్ల రక్త ప్రవాహం మెరుగుపడుతుంది, ఇది నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉన్నప్పుడు కోల్డ్ కాంప్రెస్ ఉపయోగించడం మంచిది.

# 8 కోట్ల 90 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు

### -ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** రూ. 8 కోట్ల 90 లక్షల వ్యయంతో చేపట్టిన బీ.టీ. రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపన చేసారు. గురువారం ఉప ముఖ్యమంత్రి చింతకాని మండలంలో పర్యటించి సి.ఆర్.ఆర్. నిధులు అంచనా వ్యయం 5 కోట్ల 40 లక్షల నిధులతో చేపట్టిన నాగులవంచ తిర్లాపురం ఆర్ అండ్ బి రోడ్డు నుండి చింతకాని వయా తుమ్మలచెరువు బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, నాగులవంచ నుండి తిమ్మినేనిపాలెం తిర్లాపురం క్రాస్ రోడ్డు వరకు 3 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన బి.టి. రోడ్డు పనులకు నాగులవంచ వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి, అగ్రిమెంట్ సమయం లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కులగణన సర్వేను జయప్రదం చేయండి

### -అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఈనెల ఆరవ తారీకు నుండితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా బీసీలుయొక్క స్థితిగతులు జనాభా వివరాలు పూర్తిగా తెలియడం ద్వారా రాజ్యాంగం నుండి సంక్రమించే హక్కులు అధిక జనాభా గలిగిన బీసీలకు వచ్చే అవకాశం ఉందని, కావున అధికారులకు సహకరించవలసిందిగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం అఖిలభారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం 2014 ఆగస్టులో చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే ద్వారా బీసీల శాతం 61% ఉన్నదని తేలింది. కానీ దాన్ని గత ప్రభుత్వం ఆ సర్వేని బయటపెట్టకుండా బీసీలకు రావాల్సిన హక్కులను రాకుండా అణగదొక్కడం జరిగిందని,బీసీల జనాభా ఎక్కువ ఉన్నదని తెలిస్తే హక్కుల కోసం పోరాటం చేస్తారని, వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయడం జరిగింది అని, ఆ విధంగా కాకుండా ఈసారి చేపట్టి




కార్యక్రమం నిష్పక్షపాతంగా, ఉండాలని, సర్వే వివరాలను వెంటనే అధికారికంగా ప్రభుత్వం ప్రకటించాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్వే ఆధారంగా బీసీలకు రాజ్యాంగ అధికారం కలిగించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా యాదవులు సర్వే ఫారం కులం(7)లో యాదవ్ అని వ్రాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్ ఎస్ టి ( సంచార జాతులు) సర్టిఫికెట్ను యాదవులకు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకులు పొదిల సతీష్, సత్తి వెంకన్న యాదవ్, వాగదాని కోటేశ్వరరావు పొదిలి భూపతి, కంకు వెంకటేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

# పకడ్బందీగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- నవంబర్ 8 నుంచి ఇంటింటి సర్వే జిల్లాలో ప్రారంభించాలి
- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. సర్వే నిర్వహణకు నిర్దేశించిన ఫార్మాట్ లో ఫారం లు సిద్ధమయ్యాయా, సర్వే సిబ్బందికి అవసరమైన పరికరాలు, స్టేషనరీ ఐటెమ్స్ పంపిణీ మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 8 నుంచి ఖమ్మం జిల్లాలో ఇంటింటికి తిరుగుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ ప్రారంభించాలని అన్నారు. ఖమ్మం నియోజకవర్గం వర్గానికి జెడ్పీ డిప్యూటీ సిఇఓ నాగలక్ష్మి, ఖమ్మం కార్పొరేషన్ కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, వైరా నియోజకవర్గానికి ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, మధిర నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్ అధికారి ఖమ్మం నర్సింహారావు, సత్తుపల్లి నియోజకవర్గానికి ఆర్డిఓ కల్లూరు రాజేందర్ లు ఇంచార్జి లుగా ఉంటారని అన్నారు. సర్వే ప్రాముఖ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేయాలని అన్నారు. అసెంబ్లీ ఇంచార్జి అధికారులు ఏదైనా శాఖ నుంచి సరైన స్పందన లేకపోతే సమాచారం అందిస్తారని, వెంటనే పనితీరు మెరుగు పర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్యుమరేటర్లు పూర్తి స్థాయిలో బాధ్యతలను స్వీకరించి సర్వే పనులు ప్రారంభించేలా సన్నద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నియమించిన ఎన్యుమరేటర్లు వెంటనే రిపోర్టు చేసేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేకు రిపోర్ట్ చేయని ఎన్యుమరేటర్లకు గల కారణాలను సంబంధిత శాఖ అధిపతుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే విధులు చాలా తప్పనిసరి అని, ఇది వాలంటరీ పని కాదని తప్పనిసరిగా చేయాల్సిన బాధ్యతని, దీనిపై నిర్లక్ష్యంగా వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ సర్వే నిర్వహణకు ప్రాథమికంగా అవసరమైన సామాగ్రి, ప్రశ్నావళి ఫార్మాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్వే నిర్వహణకు నియమించిన ఎన్యుమరేటర్లు విధులకు హాజరయ్యే విధంగా సంబంధిత శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కళావతి బాయి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖరశర్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ముస్లిం మైనారిటీల సమస్యలపై సమ్మాన్ ఎన్జీవో (సొసైటీ ఫర్ ఆల్ మైనారిటీస్ అభివృద్ధి, న్యాయ్) వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్వకేట్ సాదిక్ షేక్, సభ్యులు మంగళవారం డిస్ట్రిక్ట్ మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆఫీసర్ (డిఎండబ్ల్యూ) సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలు, సమస్యలపై చర్చించడం జరిగింది. ముఖ్యంగా జిల్లా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా ఎన్నో యేండ్ల నుండి కమిటీ ఏర్పాటు కాకపోవడం శోచనీయం అని అడ్వకేట్ సాదిక్ షేక్ విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ద్వితీయ భాష అయిన ఉర్దూ నా భాషా పరిరక్షణ, ఉర్దూ మీడియం ఇంటర్ డిగ్రీ కాలేజి స్థాపన చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఖమ్మం కార్పోరేషన్లో ఎక్కువగా స్వయం ఉపాధి మీద ఆధారపడి బ్రతికే కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా తోపుడు బండ్ల పండ్ల వ్యాపారం, పూలు, కూరగాయల వ్యాపారం, పాన్ షాప్, సైకిల్ షాప్, మెకానిక్ షాప్ చాయ్ డబ్బాల మీద ఆధారపడే వారే ఎక్కువ కావున వారిని ప్రైవేట్ ఫైనాన్షియర్ల బారి నుండి కాపాడటానికి 100శాతం సబ్సిడీ లోన్స్ తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఖమ్మంకు అత్యధిక బడ్జెట్ తో రిలీజ్ చేయించాలి అని సాదిక్ షేక్ కోరారు. పెరుగుతున్న జనాభా రీత్యా పాత షాదిఖానా సరిపోగా రిపేర్ల బూత్ బంగ్లాగా మారింది అని బాధను వెలిబుచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో హడావుడి గాడా వుడి చేసిన కొత్త షాదిఖానా ఇప్పటికీ ప్రజలకు అందుబాటులో రాలేదు అని ఆశ్చర్యం వెలిబుచ్చారు. వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ముస్లిం మైనారిటీల సమస్యల



పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని సమ్మాన్ ఎన్జీవో తరపు నుండి ప్రత్యేక డిమాండు చేశారు. ప్రకాష్ నగర్, బల్లెపల్లి, తదితర ప్రాంతాల్లో ఖబ్రిస్తాన్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని గుర్తు చేశారు. గాంధీ చౌక్ ఈద్గా, గొల్లగూడెం ఈద్గా ప్రహరీ గోడలు నిర్మించి రక్షణ కల్పించి వాటిని అభివృది చేయాల్సిందిగా సాదిక్ షేక్ కోరారు –అర్బన్ తహసిల్దార్ మరియు కలెక్టర్ పర్యవేక్షణ లో ఉన్న పాత షాదిఖానా ను ప్రభు ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీకి డైరెక్ట్ మేనేజ్మెంట్ గా ఇవ్వాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు సంబంధించిన ఎన్నో అంశాలను ప్రస్తావించగా అన్నిటికీ సానుకూలంగా స్పందించిన డిఎండబ్ల్యూ సత్య నారాయణ ఒక్కో అంశం ను దశల వారీగా పరిష్కరిస్తాం అని హామీ ఇవ్వడం జరిగిందని లిఖితపూర్వకంగా సమ్మాన్ ఎన్జీవో తరపు నుండి దరఖాస్తుకూడా సమర్పించడం జరిగింది అని సమ్మాన్ ఎన్జీవో వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్వకేట్ సాదిక్ షేక్ మీడియా ముఖంగా తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సయ్యద్ అబూ బకర్ సుల్తాన్, యూనుస్ పాల్గొన్నారు.

# బెంగళూరు చేరుకున్న హైడ్రా బృందం

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :** బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ తీరును హైడ్రా పరిశీలిస్తోంది. ఇక్కడ గొలుసుకట్టు చెరువులను పునరుద్దరించారు. వీటిని పరిశీలించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరు చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఆయన నగరంలో చెరువుల పునరుద్ధరణపై అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు బుధవారమే బెంగళూరు వెళ్లగా.. రంగనాథ్ గురువారం అక్కడికి చేరుకున్నారు. చెరువుల పనరుద్ధరణతో పాటు విపత్తు నిర్వహణపై వారు అధ్యయనం చేయనున్నారు. హైడ్రా అధికారులు తమ పర్యటనలో యలహంకలోని కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించనున్నారు. అక్కడి సీనియర్ శాస్త్రవేత్తలతో విపత్తు నిర్వహణపై సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి సెన్సార్స్ సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలిస్తారు. బెంగళూరు కోర్ సిటీలో ఉన్న చెరువులను సందర్శిస్తారు. రెండో రోజు పర్యటనలో లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో రంగనాథ్ సమావేశం కానున్నారు. కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2014పై చర్చించనున్నారు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హళ్లీ చెరువు, ఇన్ఫోసిస్ సంస్థ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించి అక్కడ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాంకేతికతను తెలుసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో ఐదు చెరువులను పునరుద్ధరించాలని ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది. కర్ణాటక ప్రభుత్వంతో పాటు సీఎస్ఆర్ కింద కొన్ని కంపెనీలు అభివృద్ధి చేసిన చెరువులను మూడు రోజుల పాటు స్టడీ చేయనున్నారు. తక్కువ ఖర్చుతో కర్ణాటక ప్రభుత్వం బెంగుళూరు లో 35 చెరువులను అభివృద్ధి చేసింది. చెరువుల పరిరక్షణకు, తీసుకుంటున్న చర్యలపై.. హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పర్యటిస్తున్నారు. పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత సిటీలో మొదటి దశలో నాలుగు చెరువుల ప్రక్షాళనపై ఫోకస్ పెట్టనున్నారు.

# నిరుపేదలైన మహిళల జీవితాలు ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేలా క్షేత్రస్థాయిలో డిఆర్డిఏ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



**బాపట్ల,తెలంగాణ ముచ్చట్లు :** నిరుపేదలైన మహిళల జీవితాలు ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే లా క్షేత్రస్థాయిలో డిఆర్డిఏ అధికా రులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. డి ఆర్ డి ఏ లో అమల య్యే పథకాలపై ఆశాఖ అధికారు లతో గురువారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమీక్ష నిర్వహించారు. పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలను లక్షాధికారులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. డ్వాక్రా సంఘాలలోని మహిళల అభ్యున్నతపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జిల్లాలో మూడు లక్షల నలభై వేల 725 మంది మహిళలు పొదుపు చేసుకుంటూ... 33,374 డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఒక వెయ్యి 31 గ్రామ సంఘాలు నడుస్తున్నాయన్నారు. పొదుపు మహిళలంతా దాచుకున్న సొమ్ము బ్యాంకులలో రూ.438 కోట్లు ఉన్నాయన్నారు. మహిళలు తమ పొదుపు సొమ్మును వినియోగించుకునేలా 50 శాతం మేరకు నగదును సంఘాలకు విడుదల చేయాలన్నారు. బ్యాంక్ అధికారులు రూ.215 కోట్ల నిధులను మహిళలకు విడుదల చేయాలన్నారు. బ్యాంక్ రుణాలలో నగరం, సొంతమాగులూరు, జై పంగులూరు, రేపల్లె మండలలో లక్ష్యాలు సాధించకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలను మంజూరు చేయించాలని ఆయన ఆదేశించారు. ఉన్నతి పథకాన్ని అధికారులు సమర్థంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. బ్యాంకు రుణాల తిరిగి చెల్లింపులు సక్రమంగా జరగకపోవడంపై ఆరా తీశారు. మొండి బకాయిలు రూ.17.15 కోట్లు నిలిచిపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మహిళలను డి ఆర్ డి ఏ అధికారులు చైతన్య పర్చాలన్నారు. సమస్యలు ఎదురైతే తక్షణమే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పీఎంఈజిపి, పీఎంఎఫ్ఎంఈ పథకాల ద్వారా మహిళలకు యూనిట్లు మంజూరు చేయాలన్నారు. తద్వారా వ్యాపారవేత్తలను చేయాలని సూచించారు. మహిళలను లక్షాధికారులను చేయడం ఉద్దేశంతో వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు. వాటిని సద్వినియోగపరుచుకుని ఆర్థిక అభివృద్ధి వైపు మహిళలు అడుగులు వేసేలా ప్రోత్సహించాలన్నారు. ఉన్నతి పథకం కింద విడుదలైన కాజేసిన వారిపై చట్టబరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి వారిపై కేసులు పెట్టి, ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలన్నారు. అవసరమైతే ఆర్ ఓ ఆర్ చట్టం కింద నగదు వసూలు చేయాలని అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలోని అధికారుల పనితీరు మెరుగుపడాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, డి ఆర్ డి ఏ పీడీ పి.పద్మ, ఎల్ డి ఎం శివకృష్ణ, పరిశ్రమల శాఖ అధికారులు, డి ఆర్ డి ఏ డిపిఎంలు, ఎపిఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతకు మారుపేరుగా డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు నిలిచారు

**బాపట్ల,తెలంగాణ ముచ్చట్లు :** నిబద్ధతకు మారుపేరుగా డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు నిలిచారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బదిలీపై వెళ్తున్న డి ఆర్ ఓ సిహెచ్ సత్తిబాబుకు వీడ్కోల సభ స్థానిక కలెక్టరేట్ లో గురువారం జరిగింది. పుష్ప కిరీటం, దుశాలువలు కప్పి పుష్పమాలలతో సత్తిబాబును ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు బహుమతులు, జ్ఞాపికలు అందించారు. బాపట్ల జిల్లాలో వనరులు తక్కువగా ఉన్నప్పటికీ సమర్థంగా పనిచేశారని జిల్లా కలెక్టర్ చెప్పారు. విధి నిర్వహణలో అత్యంత బాధ్యతతో వ్యవహరించారని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులను సమన్వయం చేసుకుంటూ నిబద్ధతతో పని చేశారన్నారు. మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడి అధిగమించేలా ప్రణాళికతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో బాధ్యతతో పనిచేయడం ఎంత ముఖ్యమో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంతే ముఖ్యమన్నారు. మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మంచి మనిషిగా చిరునవ్వుతో విధులు నిర్వహించే అధికారిగా సత్తిబాబు ప్రజల మన్ననలను పొందారని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. నిబద్ధతతో పనిచేశారని ఆయన అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. బాపట్ల జిల్లాలో పనిచేసిన కాలం నా జీవితంలో గొప్ప తీపి గుర్తుగా నిలిచిపోతుందని బదిలీపై వెళ్తున్న డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు అన్నారు. అన్ని స్థాయిలోని అధికారులు, సిబ్బంది నాకు అందించిన సహాయ సహకారాలతోనే బాపట్లలో సమర్థంగా తొమ్మిదినెలల పాటు విధులు నిర్వహించానన్నారు. అందరి ఆధారాభిమానాలు ఎన్నటికీ మరువలేనన్నారు. ఉప తాసిల్దార్ గా ప్రభుత్వ ఉద్యోగంలోకి చేరిన నాటి నుంచి జవాబు దారితనం, క్రమశిక్షణతో పనిచేయడం అలవడిందన్నారు. బాపట్ల జిల్లాలో ఎన్నికల నిర్వహణ, కృష్ణా నది వరద విపత్తులో సమర్థంగా విధుల నిర్వహణకు కలెక్టర్లు, జేసీలు, ఇతర శాఖల జిల్లా అధికారుల సహకారం ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల, చీరాల ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలకు ఏపీ సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్

- సోషల్ మీడియాలో అద్దు అదుపు లేకుండా పోతుందని ఆవేదన
- ఆడపిల్లల విషయాలపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోను

**అమరావతి, తెలంగాణ ముచ్చట్లు :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీ శ్రేణులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియా ద్వారా అడ్డు, అదుపులేకుండా ఆడపిల్లల వ్యక్తిగత విషయాలపై విష ప్రచారం చేస్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలిపెట్టేది లేదని హెచ్చరించారు. సోమవారం గుంటూరు జిల్లా తాళ్లాయపాలెంలో పలు విద్యుత్ ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపనల్లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. ఏపీలో సోషల్ మీడియాకు అడ్డుఅదుపులేకుండా పోయిందని , మధమెక్కి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత, ఎమ్మెల్యేలు , రాష్ట్రంలోని మహిళలపై సోషల్ మీడియా ద్వారా పోస్టింగులు పెట్టడాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ఆంధ్రప్రదేశ్ పర్యాటకులతో గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు





మిజోరామ్, తెలంగాణ ముచ్చట్లు : మిజోరామ్ ప్రకృతి సౌందర్య విశేషాలను, పర్యాటక అంశాలను ఇక్కడి ప్రజల ఆదర్శవంతమయిన జీవన విధానాన్ని లోకానికి తెలియ చెప్పాలని మిజోరామ్ గవర్నర్ కంభంపాటి హరిబాబు పిలుపు నిచ్చారు. ఎంతో ప్రశాంత రాష్ట్రంగా నీతి, నిజాయితీతో వ్యవహరించే ప్రజలు కలిగిన ప్రాంతంగా మిజోరామ్ ఉందన్నారు. గవర్నర్ హరిబాబు ఆహ్వానం మేరకు విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, పద్మభూషణ్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ నుండి 16 మంది సభ్యులతో కూడిన పర్యాటక బృందం 5 రోజుల పర్యటనకు మిజోరామ్ వచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ పర్యాటక పరంగా మిజోరామ్ ఎంతో ఆకర్షణీయ రాష్ట్రమని, ఇక్కడి ప్రజలు వినయ సంపన్నులని వివరించారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల లో అమ్మకం దారుడు లేకుండా దుకాణాలు వుంటాయని ఎవరికి వారు కావలసిన వస్తువులు తీసుకుని నగదు అక్కడ పెట్టి వెళ్లిపోతుంటారని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ లో పోలీసులు లేకుండా ప్రజలే స్వీయ నియంత్రణ పాటిస్తారని, ఎన్నికలలో బ్యానర్లు, లౌడ్ స్పీకర్లు, సభలు వుండవని, ఎవరంతట వారు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకుంటారని గవర్నర్ అన్నారు. ఘర్షణ వాతావరణం కనిపించదని, ప్రజలు ప్రశాంత జీవితాన్ని కోరుకుంటారని నిజానికి ఈ విషయాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు తెలియవన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి మిజోరామ్ వెళ్లిన బృందానికి గవర్నర్ హరిబాబు రాజభవన్ అతిథి గృహం లో వసతి ఏర్పాటు చేయటమే కాక, వివిధ ప్రాంతాల పర్యటనకు అవసరమైన రవాణా సౌకర్యాలను సమకూర్చారు. ప్రత్యేకంగా వీరికి రాజభవన్ దర్బార్ హాలులో ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. బృందం సభ్యులు వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించి. గవర్నర్ దంపతులను సత్కరించగా అతిథులందరికి గవర్నర్ దంపతులు మిజోరామ్ సాంప్రదాయ ఉత్పత్తులను బహుకరించారు. వీరికి అవసరమైన వసతి, భోజన ఏర్పాటులను గవర్నర్ సతీమణి జయశ్రీ వ్యక్తిగతంగా పర్యవేక్షించి, మహిళల తో ప్రత్యేకంగా సమావేశమై విభిన్న విషయాలను తెలసుకున్నారు. మిజోరామ్ విశ్వవిద్యాలయంలో వున్న తెలుగు విధ్యార్థులు, అధ్యాపకులు, అక్కడి హిందీ విభాగంలోని ఆచార్యులతో అచార్య యార్లగడ్డ ప్రత్యేకంగా సమావేశమై ప్రసంగించేలా గవర్నర్ ప్రత్యేక ఏర్పాట్లు చేయ్యటం విశేషం.



# రెండవ పంటకు అనుమతినివ్వాలి

కృత్తివెన్ను, తెలంగాణ ముచ్చట్లు : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కృత్తివెన్ను మండలంలో గురువారం నాడు పర్యటించారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన రైతులు అందరూ ముక్తకంఠంతో ఈ సంవత్సరం దాళ్వా వరిసాగుకు ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు, గత నాలుగు సంవత్సరాల నుండి బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాళ్వాపంటకు అనుమతులు లేకపోవడం వలన రైతులు ,కౌలు రైతులు అపరాల పంట సాగు చేయటం జరిగింది , 90 శాతం పైగా పంటకు అయిన ఖర్చులు, విత్తనాలు ఖర్చులు కూడా రాలేదని వాపోయారు. ఈ బంటుమిల్లి మెయిన్ కాల్వ పరిధి పూర్తిగ సముద్ర తీర ప్రాంతం అగుట వలన ఉప్పు శాతం ఎక్కువగా పెరిగి పంటల దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా కొన్ని ప్రాంతాల్లో కొబ్బరి చెట్లు కూడా దెబ్బతిని చనిపోయాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం వరి పంట తప్ప, ఇతర ఏ పంటలు పండవని , ప్రభుత్వం , కృష్ణా జిల్లా కలెక్టర్ , పెడన నియోజకవర్గం శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రివర్యులు స్పందించి , ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది,వెంటనే బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాల్వా వరిసాగు పంటకు అనుమతి ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, కృత్తివెన్ను మండల రైతు సంఘం నాయకులు పుప్పాల నరసింహారావు, రైతులు బొండాడ సీతారామయ్య, పుప్పాల రాధాకృష్ణ,తోటకృష్ణ,అర్జంపూడి పాండురంగారావు, నాగరాజు,కేతినేని సత్యనారాయణ, విన్నకోట సుబ్రహ్మణ్యం, అర్జంపూడి సూరిబాబు, గంధం సుబ్బారావు,పోకల రాంబాబు, ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

# పెడనలో అధునాతన విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు : ఎంఎల్ఏ కాగిత





పెడన, తెలంగాణ ముచ్చట్లు : ఆక్వా రైతులకు రక్షణగా వారికి ఎలాంటి విద్యుత్ సమస్యలు ఏర్పడకుండా, విమానాశ్రయ భవిష్యత్తు అవసరాలకు ముందస్తు ప్రణాళిక బద్ధంగా కృష్ణాజిల్లా పెడన, గన్నవరంలలో అధునాతన విద్యుత్ సబ్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.ఏపీలోని పలు విద్యుత్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు మరియు శంకుస్థాపనల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రు.48.64 కోట్లతో పెడన 132 కేవి విద్యుత్ స్విచ్చింగ్ కేంద్రం నిర్మాణానికి, మరియు రు.30.65 కోట్లతో 11/132 కెవి గన్నవరం (ఎయిర్ పోర్ట్ ) విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి తోటమూల విద్యుత్ ఉపకేంద్ర ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అమరావతి నుండి వర్చ్యువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కృష్ణా జిల్లాలో 2 సబ్ స్టేషన్ల ఏర్పాటు వల్ల నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందించేందుకు వీలవుతుందన్నారు.ఈ సంధ్భంగా జిల్లా కలెక్టర్ డి. కే. బాలాజీ పెడన, గన్నవరంలలో విద్యుత్ సబ్స్టేషన్ల ఏర్పాటు, వాటి ప్రయోజనాలు ముఖ్యమంత్రికి వివరిస్తూ ఇంతకుముందు మచిలీపట్నం- పామర్రు ఎక్కువ దూరం పవర్ ట్రాన్స్మిషన్ వల్ల పెడన ప్రాంతంలో ఓల్టేజ్ సమస్యలు ఏర్పడేవన్నారు. పెడన ప్రాంతంలో4 వేల మంది ఆక్వా రైతులు ఉన్నారని, లో వోల్టేజ్ వల్ల మోటార్లు కాలిపోయి విద్యుత్తు సమస్యలు ఎదుర్కొనే వారని అన్నారు. 132 కేవి పెడన స్విచ్చింగ్ స్టేషన్ ఏర్పాటు వల్ల లో వోల్టేజ్ సమస్యలు తొలగిపోవడంతోపాటు, 54 వేల ఇళ్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతామని అన్నారు. రానున్న రోజుల్లో మచిలీపట్నం పోర్టు, ఇండస్ట్రియల్ విద్యుత్ అవసరాలకు ఈ సబ్ స్టేషన్ వల్ల ఎంతో ఉపయోగం ఉందన్నారు.గన్నవరం 132 కె.వి సబ్ స్టేషన్ ఏర్పాటుతో 3 మండలాల్లో 3.5 లక్షల మంది వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ విమానాశ్రయంకు ఒక ఫీడర్ కేటాయించడంతో విద్యుత్ సమస్య లేకుండా ముందుగా ప్లాన్ చేయడం హర్షనీయమన్నారు. అంతే కాకుండా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేయగలుగుతామన్నారు. ప్రస్తుత భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే ప్రణాళికాబద్ధంగా సబ్స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సబ్స్టేషన్లు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించడం ఈ ప్రాంతంలో విద్యుత్ రంగానికి మహర్దశ అని అన్నారు.పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పెడన నియోజకవర్గంలో 132 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుకు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాలకు లో వోల్టేజీ సమస్యల ఇబ్బందులుతొలగుతాయన్నారు.అనంతరం రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మీడియాతో మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్తు ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెడనలో గన్నవరంలో విద్యుత్ సబ్స్టేషన్లు ఏర్పాటు వల్ల రైల్వే లైను విద్యుత్ సరఫరాకు, రాబోయే బందరు పోర్టు విద్యుత్ అవసరాలకు, భవిష్యత్తులో ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ సిపిడిసిఎల్ ఎస్ఇ సత్యానందం, ఏపీ ట్రాన్స్కో ఎస్ఇ భాగ్యరాజ్, నడుపూరు సర్పంచ్ చీర్ల అనూష, స్థానిక నాయకులు విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పోస్టాఫీసుల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ సేవలు వేగవంతం



దుత్తలూరు, నవంబర్ తెలంగాణముచ్చట్లు : పోస్టాఫీసు ల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ సేవలను మరింత వేగవంతం చేయనున్నట్లు ఉదయగిరి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ వేగూరు సాయి క్రిష్ణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు నెంబర్ లకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(యన్పీసీఐ) లింకుల అనుసంధానం తో పాటు లావాదేవీ లు నిర్వహించక ఆగిపోయిన లింకులను పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.పట్టణాలతో పాటు పల్లెల్లో సైతం విస్తృత నెట్వర్క్ గలిగిన తపాల శాఖ తో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వివిధ ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద ప్రత్యక్ష నగదు బదిలీ ప్రయోజనాలు పొందే ప్రజలందరూ స్థానిక తపాల సిబ్బందిని సంప్రదించి తమ ఆధార్ నెంబర్ కు యన్పీసీఐ అనుసంధానం తో పాటు ఆగిపోయిన వాటిని ఈ నెల 14 వ తేదీ లోపు మీ సమీప పోస్ట్ ఆఫీసు నందు పునరుద్ధరించుకోవాలని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# నాణ్యమైన, హెచ్చు తగ్గులు లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా సబ్ స్టేషన్ ల ఏర్పాటు: జెసి శుభం బన్సల్

సూళ్లూరుపేట, తెలంగాణ ముచ్చట్లు : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం సీఠీడీపీ పరిధిలో 400/220 కె.వి. జి.ఐ.ఎస్ సబ్ స్టేషన్ ను గురువారం ఉదయం గంటలకు ప్రారంభించారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ లోని పలు విద్యుత్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం మరియు శంఖుస్థాపన కార్యక్రమమును గౌ,, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు వర్చ్యువల్ పద్ధతి ద్వారా ప్రారంభించారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట మన్నారు పోలూరు నందు 220/132 విద్యుత్ ఉప కేంద్రం నందు శంఖుస్థాపన శిలా ఫలక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహణలో మాంబట్టు సబ్ స్టేషన్ కు రూ, 43.53 కోట్ల వ్యయంతో నూతనంగా 132/33 కె.వి విద్యుత్ ఉపకేంద్రం, నిర్మాణ శంకుస్థాపనను వర్చువల్ పద్ధతి ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ నాణ్యమైన, హెచ్చు తగ్గులు లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేపడుతున్నారని, దీని వలన మాంబట్టు విద్యుత్ ఉపకేంద్రం నుండి మాంబట్టు సెజ్, అపాచి సెజ్, తడ, బి. వి.పాలెం, అక్కంపేట,కడలూరు మరియు సూళ్లూరుపేట పేట పారిశ్రామిక వినియోగదారుల కు సూళ్లూరుపేట, తడ మండలాలలో గృహ మరియు వ్యవసాయము నకు నాణ్యమైన విద్యుత్ ను అందించగలమని ఈ మాంబట్టు సబ్ స్టేషన్ వలన సుమారు 3 లక్షల మంది లబ్ధిదారులకు ఉపయోగకరంగా ఉంటుంది అని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్, సూళ్లూరుపేట అర్. డి. ఓ. కిరణ్మయి, సూళ్లూరుపేట మాజీ శాసన సభ్యులు శ్రీ నెలవల సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ నరసింహ రావు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ, ఎస్.ఈ బి.వి. శేషా రెడ్డి, డి.ఈ లు బలరాం మూర్తి, బాలశేషవులు, రఘు నందన్, రవికుమార్, శ్రీనివాసులు రెడ్డి, సురేష్, జనార్దన్ రెడ్డి, శ్రీమతి హేమలత మరియు ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# తాళ్లాయపాలెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



తుళ్లూరు, తెలంగాణ ముచ్చట్లు : నవంబర్ 8: రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు తుళ్ళూరు మండలం, తాళ్ళయపాలెం గ్రామం నందు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ వారి ఆద్వర్యంలో 400/220 %కు% గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ ఉప కేంద్రమును ప్రారంభించారు, అనంతరం రాష్ట్ర అభివృద్ధి కొరకు 400 కె.వి విద్యుత్ సరఫరా లైన్లు శాశ్వత మళ్లింపు కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లాకు విచ్చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఘన స్వాగతం పలికిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి కత్తెర హెని క్రిస్టినా.

# న్యాయవాదులపై దాడులు, అక్రమ కేసులు దారుణం

## - బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజయ్



గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు : న్యాయవాదులపై అక్రమంగా కేసులు బనాయించడం, దాడిలు చేయడం దారుణమని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బొల్లవరపు అజయ్ అన్నారు. గురువారం ఏలూరురోడ్డులోని న్యాయస్థానం సముదాయల వద్ద బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజయ్ అసోసియేషన్ సభ్యులు చోరగుడి కుటుంబరావులు మాట్లాడుతూ నందిగంలోని బార్ అసోసియేషన్ సభ్యుడు నడూరి శ్రీరామమూర్తిపై దాడి చేయడం జరిగిందన్నారు. తిరిగి అయనపైనే పోలీసులు కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయవాదుల మీద దాడిలు జరిగినప్పుడు తక్షణమే చర్యలు తీసుకునే ప్రొటెక్షన్ యాక్ట్ ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు తుమ్మలచర్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు వీరబత్తిన సుధాకార్, సిహెచ్ సూర్యరావు, షయ్యద్ అజీమ్, నత్త జోజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీ




ఒంగోలు, తెలంగాణ ముచ్చట్లు : ప్రపంచ కాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఒంగోలు జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ తమీమ్ అన్సారీయా గారి చేతులమీదగా అవగాహన దినోత్సవ రాలిని ప్రకాశము భవనం నుండి ప్రారంభించడమైనది. ఈ రాలి యొక్క ముఖ్య ఉదేశ్యం ప్రజలలో కాన్సర్ పై అవగాహన కల్పించి ఎవరును కాన్సర్ బారిన పడకుండా ముందుగా ఇంటివద్దనే స్క్రనింగ్ పరీక్షలు నిర్వహించి కాన్సర్ నుండి రక్షణ పొందవలసినదిగా ప్రజలకు అవగాహన కల్పించడమైనది . నోటి కాన్సర్ రొమ్ము కాన్సర్, గర్భాశయ ముఖద్వారా కాన్సర్ రాకుండా 18 సంవత్సరములు దాటినా స్త్రీ పురుషులు అందరుకూడా కాన్సర్ స్క్రనింగ్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పకుండ చేసుకొనవలసినదిగా జిల్లా కలెక్టర్ గారు ఒంగోలు ప్రజలకు తెలియజేసినారు. కాన్సర్ పరీక్షలను చేసుకున్నందువలన కాన్సర్ వ్యాధిని ప్రాధమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం ద్వారా కాన్సర్ ను నివారించవచ్చునని కలెక్టర్ గారు తెలిపినారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ ద్వారా ఈ యొక్క స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది. ఈ స్క్రీనింగ్ పరీక్షల కొరకు పట్టణ మరియు ప్రాధమిక ఆరోగ్య కేంద్రములలో పనిచేయు సిబ్బంది అందరికి స్క్రీనింగ్ టెస్టులపై ట్రైనింగ్ ఇవ్వడం జరిగినది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి %ణతీ. ణ%. సురేష్ కుమార్ మాట్లాడుతూ నోటి కాన్సర్, సాధారణ కాన్సర్ మరియు బ్రెస్ట్ కాన్సర్ నివారణపై ఈ నెల 14 వ తేదీ నుండి జరుగు హౌసేహోల్డ సర్వే నందు 18 సంవత్సరములు దాటినా స్త్రీ పురుషులు అందరుకూడా కాన్సర్ స్క్రనింగ్ పరీక్షలు తప్పకుండ చేసుకొనవలసినదిగా ప్రజలకు అవగాహన కల్పించవలసినదిగా కోరడమైనది.

# కందుకూరు డిఎస్పి సుబ్రహ్మణ్యంను మర్యాదపూర్వకంగా కలిసిన, మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్




కందుకూరు, తెలంగాణ ముచ్చట్లు : కందుకూరు డిఎస్పి సుబ్రహ్మణ్యం ను కార్యాలయంలో వైసీపీ ఇన్చార్జి బుర్ర మధుసూదన్ యాదవ్ , వైకాపా నాయకులు ముప్పవరపు కిషోర్, తోకల కొండయ్య, గంగిరెడ్డి, రహీం తదితరులు..

# నాటుసారా రహిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం





తిరువూరు, తెలంగాణ ముచ్చట్లు : నియోజకవర్గం లో గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం గ్రామంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, తిరువూరుబీ మొబైల్ పెట్రోలింగ్ పార్టీ, తిరువూరు మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్ ఫోర్స్, విజయవాడ టీములు సంయుక్తంగా దాడులు నిర్వహించి నాటుసారా కాయడానికి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను కనుగొని నేరస్థలంలో ధ్వంసం చేయడం జరిగింది. ఈదాడుల్లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వి.వి.వి.ఎన్.ఎన్.వర్మ, ఎన్ఐలు వెంకటకుమార్, శేఖర్ బాబు, కృష్ణవేణి, హెడ్ కానిస్టేబుల్స్ నాగేశ్వరరావు, భవానీ, నాగరాజుబీ కానిస్టేబుల్స్ శివదుర్గ, నాగరాజు, వెంకటేశ్ నాయక్, సత్యనారాయణ, జగదీశ్ లు పాల్గొన్నారు. తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ లో దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.తదుపరి అమ్మిరెడ్డిగూడెం గ్రామ సచివాలయం వద్ద నవోదయం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇన్స్పెక్టర్ వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా ప్రకటించడంలి ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు.



# నిత్యావసర సరుకులను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు

మచిలీపట్నం నవంబర్ 7 తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా నిత్యావసర సరుకులను దాచిపెట్టి కృత్తిమ కొరత సృష్టిస్తే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యాపారస్తులను హెచ్చరించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో కందిపప్పు బియ్యము సన్ఫ్లవర్ ఆయిల్ ,పామాయిల్ టమోటా ఉల్లిగడ్డలు తదితర నిత్యవసర సరుకుల ధరలు బహిరంగ మార్కెట్లో, రైతు బజార్లో ఎలా ఉన్నాయని వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు నిత్యవసర సరుకులను ప్రజలకు విక్రయించాలన్నారు. ఎట్టి పరిస్థితులలో ధరల్లో ఏమాత్రం తేడా వచ్చిన ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో కూడా రాజీపడరాదని సూచించారు. కావాలని అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడరాదని స్పష్టం చేస్తూ అందులకు బాధ్యులైన వారి పైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరసమైన ధరలకు నిత్యవసర సరుకులను అందించాలని సూచించారు. ప్రస్తుతం ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు కిలో 150 రూపాయలు చొప్పున, సోనామసూరి బిపిటి (స్టీమ్డ్ )బియ్యం కిలో 48 రూపాయలకు, సోనా మసూరి బిపిటి (రా) బియ్యం 47 రూపాయల చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నామన్నారు. అలాగే సన్ఫ్లవర్ నూనె ప్యాకెట్లను లీటర్ 124 రూపాయలు చొప్పున, పామోలిన్ నూనె లీటర్ 114 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నామన్నారు. అదేవిధంగా అన్ని సూపర్ మార్కెట్లు, హెూల్సేల్, రీటైల్ దుకాణాల్లో కూడా ప్రత్యేక కౌంటర్లు తెరచి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నిత్యవసర సరుకులను వినియోగదారులకు విక్రయించాలన్నారు. దుకాణాలను తనిఖీ చేసి తూకంలో గాని, వస్తువుల నాణ్యత లో గాని ఏమైనా తేడాలు ఉన్నాయా? సరిగా ఉన్నాయా లేదా గమనించాలని కలెక్టర్ తూనికలు కొలతల అధికారికి సూచించారు. ప్రస్తుతం రైతు బజారులో టమోటా కిలో 30 రూపాయల చొప్పున, ఉల్లిగడ్డలు కర్నూలు రకం కిలో 33 రూపాయలు చొప్పున, సోలాపూర్ రకం కిలో 42 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నామని మార్కెటింగ్ ఏడి నిత్యానందం కలెక్టర్కు వివరించారు. బహిరంగ మార్కెట్లో ఉల్లిగడ్డలు కర్నూల్ రకం కిలో 38 రూపాయలకు, సోలాపూర్ రకం కిలో 52 రూపాయలకు విక్రయించడం జరుగుతుందని కలెక్టర్కు వివరించారు. ఈ సమావేశంలో డిఎస్ఓ పార్వతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి,మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానందం, సి టి ఓ వి వెంకటేశ్వరరావు, తూనికలు కొలతలు సహాయ అధికారి రాజేంద్రప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్, రైస్ మిల్లర్ల, , రైతు సంఘాల హెూల్ సేల్ రిటైల్ సంఘాల ప్రతినిధులు, బియ్యము, చక్కెర, గోధుమలు,వంటనూనెలు, దాన్యం వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# దీపం-2 పథకంతో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు..

## - సందేహాలకు టోల్ ఫ్రీ నంబరు 1967కు కాల్ చేయండి

## - జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ



మచిలీపట్నం, తెలంగాణ ముచ్చట్లు : దీపం-2 పథకంతో ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారులు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందవచ్చని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ వినియోగదారులను కోరారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ దీపం-2 పథకం వినియోగంపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా గ్యాస్ కనెక్షన్ కలిగి రేషన్, ఆధారు కార్డులు ఉన్న ప్రతి వినియోగదారుడు దీపం 2 ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందుటకు అర్హులని పేర్కొన్నారు. ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ కు బ్యాంకు ఖాతా, రేషన్, ఆధార్ కార్డు తప్పనిసరిగా అనుసంధానం అయి ఉండాలన్నారు. గ్యాస్ కనెక్షన్ తో బ్యాంక్ ఖాతా సంధానం కాకపోయి ఉంటే గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వినియోగదారుడి గృహం వద్దే ఈ కేవైసీ చేసుకుంటారని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందుటకు వినియోగదారుడు మొదట ఖాళీ గ్యాస్ సిలిండర్ ను బుక్ చేసుకుని నగదు చెల్లించాల్సి ఉంటుందని, సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ నగదు మొత్తం నేరుగా లబ్ధిదారుడి ఖాతాకు జమ అవుతుందన్నారు. ఈ పథకం ఇప్పటికే నవంబరు ఒకటవ తేదీ నుంచి ప్రారంభమై మొదటి సిలిండర్ పొందుటకు బుకింగ్ లు మొదలయ్యాయని, ఇది మార్చి 2025 వరకు కొనసాగుతుందన్నారు. అప్పటిలోగా వినియోగదారులు మొదటి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవచ్చని, ఈ విషయంలో వినియోగదారులు ఆందోళన చెందనవసరంలేదన్నారు.

# కేంద్ర మంత్రి అమిత్‌షాతో పవన్ కల్యాణ్ భేటీ



ఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు : కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాతో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పవన్ అమిత్‌షాతో సమావేశమయ్యారు. సహకార శాఖ నుంచి నిధుల కేటాయింపుపై అమిత్ షాతో పవన్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాష్ట్రానికి రావాల్సిన నిధుల అంశం ఇరువురి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. సర్పంచ్ లతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమావేశం జనసేన పార్టీ కార్యాలయంలో సర్పంచ్ సంఘాలతో సమావేశం అయిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థ రద్దుపై కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలన్న సర్పంచుల విజ్ఞప్తిపై స్పందించిన పవన్.. వాలంటీర్లకు మేలు చేయాలనే ఆలోచలతోనే కూటమి ప్రభుత్వం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.. అయితే, గత ప్రభుత్వం వారిని మోసం చేసిందని విమర్శించారు.. వాళ్లు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చు.. కానీ, వాళ్లు అసలు వ్యవస్థలోనే లేరు.. ఇదో సాంకేతిక సమస్య అన్నారు.. ఇక, గ్రామలకు నీళ్లు పంపడానికి సరైన పైప్ లైన్ల విషయంలో పూర్తిగా మార్పులు తెస్తాం.. టెక్నికల్ గా లోపాలు గుర్తించాం అన్నారు పవన్.. గ్రామలకు సంబంధించిన నిధులు విడుదలపై ఆర్థిక శాఖతో మాట్లాతాం అన్నారు. ఉచిత విద్యుత్ విషయంలో కేబినెట్ లో నిర్ణయం తీసుకుంటాం.. ఉచిత విద్యుత్ అంశంపై కేబినెట్ లో మాట్లాడతామని తెలిపారు పవన్ కల్యాణ్.. క్వారీలలో బాంబు పేలినా చాలా ఇళ్ళు దెబ్బతింటాయి.. సినరేజీ గురించి మాట్లాడుతాం.. బకాయిలు లక్షకోట్లు దాటేలా కనిపిస్తోంది%ొ% మేం ప్రతీ అంశంలో పూర్తిగా కట్టుబడి ఉన్నాం.. స్టేట్ ఫైనాన్స్ కమీషన్ నుంచీ రావాల్సిన వాటిపైన కూడా ఆర్థిక శాఖతో మాట్లాడుతాం అన్నారు.. సర్పంచ్ అనేవాళ్లు గ్రామ ప్రధమ పౌరుడు అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

## - ఒక్క తల్లి చనిపోకూడదు
## - పీహెచ్సీ వారిగా హెల్త్ స్టేటస్ ఇండికేటర్స్ తయారు చేయాలి
## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్
## - కూడేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**అనంతపురం, తెలంగాణ ముచ్చట్లు :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. గురువారం కూడేరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రిలో పరికరాలను ఉపయోగించాలన్నారు. ఆస్పత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రసూతి మరణాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతోందని, తల్లులు చనిపోతే ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనే దానిపై దృష్టి సారించడం, ఆరోగ్యశాఖపై నిఘా పెట్టడం జరిగిందన్నారు. ఇందులో క్షేత్రస్థాయిలో తల్లుల నమోదు జరగాలని, వారికి పౌష్టికాహారం ఇవ్వాలని, ప్రసవాలు ఇబ్బందికరంగా లేకుండా ఉండాలని, సంక్లిష్టంగా ఉంటే హైరిస్క్ అని భావించి ఇక్కడి ఆస్పత్రుల నుంచిపై స్థాయికి పంపించాలన్నారు. దానిపై గ్రామస్థాయి, మెడికల్ అధికారి వారిగా వివరంగా సమీక్ష చేస్తున్నామన్నారు. దానికి ఈరోజు శ్రీకారం చుడుతూ కూడేరు మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేయడం జరిగిందన్నారు. పీహెచ్సీ పరిధిలో పీహెచ్సీ హెల్త్ ప్రొఫైల్ ని తయారు చేసుకోవాలని, ఆ హెల్త్ ప్రొఫైల్ లో ఎన్ని ఇల్లు ఉంటాయి, దగ్గరలోని సిహెచ్సి ఏది, ఏరియా ఆసుపత్రి, జిజిహెచ్ ఎంత దూరంలో ఉంది అని తయారు చేసుకోవాలని, దీని ద్వారా తల్లులకు అవగాహన కల్పించేందుకు వీలుంటుందన్నారు. పీహెచ్సీ పరిధిలో తల్లులు ఎంతమంది చనిపోయారు, ఐదేళ్ల లోపు వారు, పుట్టిన బిడ్డలు ఎంతమంది చనిపోయారు, ఎయిడ్స్ సోకిన వారు ఎంతమంది ఉన్నారు అనే వివరాలు తయారు చేసుకుంటారన్నారు. పీహెచ్సీ వారిగా హెల్త్ స్టేటస్ ఇండికేటర్స్ తయారు చేయడం వల్ల ప్రజారోగ్యాన్ని బాగా పెట్టగలుగుతామని, ప్రజల ఆరోగ్య సమస్యలను అరికట్టగలుగుతామన్నారు. ఆ నేపథ్యంలో కూడేరులో ఒక ప్రయోగం మొదలుపెట్టామని, జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్సీలో కూడా ఆ పీహెచ్సీ మెడికల్ అధికారి ఈ ప్రొఫైల్ ని తయారు చేసుకోవాలన్నారు. తర్వాత ఆర్థికంగా వారికి ఏం కావాలి, అందులో ఎన్క్వాస్ సర్టిఫికేషన్ (నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ సర్టిఫికేషన్) కూడేరు పిహెచ్సి తెచ్చుకున్నారని, దానిని రెన్యువల్ కి పంపించాలన్నారు. క్వాలిటీ సర్టిఫికేషన్ ప్రతి పిహెచ్సి, సిహెచ్సి, ఏరియా ఆసుపత్రి తెచ్చుకోవాలనేది కార్యచరణ ప్రణాళిక తయారు చేస్తున్నామని, డిసెంబర్ ఆఖరికి 20 ఆసుపత్రులకు తెచ్చుకోవాలని ప్రణాళిక పెట్టుకున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు 20 ఆసుపత్రులకుక్వాలిటీ సర్టిఫికేషన్ తెచ్చుకోవాలని చూస్తున్నామని, అందుకు డబ్బు అవసరం ఉంటుందని, ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా కమిషనర్, సెక్రెటరీ తో మాట్లాడి బడ్జెట్ కావాలని అడుగుతున్నామన్నారు. నాన్ ఫైనాన్షియల్ కు సంబంధించి డాక్టర్లు స్టెతస్కోప్, ఐడి కార్డు వేసుకోవాలని, శిక్షణ చేయాలని, నర్సులు రిజిస్టర్ మైంటైన్ చేయాలని, ఫార్మసిస్టు నిల్వలు చూడాలని,లాంటివి ఉన్న డబ్బు తోనే మనం చేయగలేవని,ప్రొసీజర్స్ అండ్ ప్రోటోకాల్ లాంటివి చేయాలని అనుకున్నామన్నారు. నాణ్యమైన ఆరోగ్యసేవలు ఇస్తుంటే తల్లులు, ప్రజారోగ్యం బాగుంటుందని, విష జ్వరాలను అరికట్టగలుగుతామనే లక్ష్యంతో ఒక యాక్టివిటీని జిల్లాలో మొదలుపెట్టామన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా ఒక్క తల్లి చనిపోకూడదన్నారు. తర్వాత తల్లులతో ఇంటరాక్షన్ చేపడుతున్నామని, ఏఎన్ఎం, ఆశ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఒక నాణ్యమైన గైడెన్స్ తల్లులకు ఇవ్వాలని, తల్లులు కూడా వాటిని వినాలని, ఏ కారణంతో వినడం లేదు అనేది చూడాలని, సామాజిక, కుటుంబ ఒత్తిడులు ఉన్నాయా, మూఢనమ్మకాలు ఉన్నాయా, వాటన్నిటినీ ఎఫెక్టివ్ ఎంగేజ్మెంట్ విత్ మదర్ అనేది ఆరోగ్యశాఖతోపాటు ఐసిడిఎస్ సమన్వయంతో చేపడుతున్నామన్నారు. దీని ద్వారా గతంతో కంటే గత మూడు నెలలు పరిస్థితి ఎంతో బాగుందన్నారు. మెడికల్ అధికారులకు నగరంలోని జిజిహెచ్ లో శిక్షణ రొటేషన్ లో నిర్వహిస్తామని, జిల్లాలో 45 రూరల్ సిహెచ్సిలు, 20 యూపీహెచ్సీలు ఉంటే, వారానికి ఒక డాక్టర్ జిజిహెచ్ లోని ప్రసూతి విభాగంలో శిక్షణ పొందాలని, దానిద్వారా సంక్లిష్ట కేసులను ఎలా చేయాలనే దానిపై అవగాహన వస్తుందన్నారు. అంతేకాక క్షేత్రస్థాయిలో డాక్టర్ల నైపుణ్యాలు మరింత మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ గత 6 నెలల నుంచి నెలకు రెండు మరణాలు ఉండగా, గత మూడు నెలల నుంచి మరణాలను సున్నాకు తీసుకువచ్చి అరికట్టామన్నారు. మరణాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్హెచ్ఓ డా.ఈబి.దేవి, మెడికల్ అధికారులు డా.లక్ష్మీనారాయణ, డా.సౌమ్య రెడ్డి, తహసిల్దార్ మహబూబ్ బాషా, సర్పంచ్ లలితమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 9న సీప్లేన్ ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు నాయుడు

## - సీప్లేన్ లో విజయవాడ నుండి శ్రీశైలం రానున్న సీఎం.......
## - ఈ సందర్భంగా సీప్లేన్ విధాన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ, జాయింట్ కలెక్టర్





**శ్రీశైలం,తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని... ఇందులో భాగంగానే సీప్లేన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గ ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం శ్రీశైలంలో స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ లతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాతాళ గంగ వద్ద బోటింగ్ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మీడియా విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ కృష్ణా నది పున్నమి ఘాట్ నుంచి విజయవాడ – శ్రీశైలం మధ్య సీప్లేన్ ప్రారంభానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారన్నారు. విజయవాడలో ప్రారంభమైన సీప్లేన్ నల్గొండ టన్నెల్ వద్ద ల్యాండ్ అయి పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద ప్లాస్టిక్ జెట్ కు చేరుకొని రోప్ వే ద్వారా శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సందర్శిస్తారన్నారు. ఇందుకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, గ్రీన్ రూమ్, విఐపి ల సీటింగ్ అరేంజ్మెంట్ తదితర ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రోప్ వే ఎంట్రీ పాయింట్ వెలుపల ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి ఎల్ 1, గ్రీన్ రూమ్ ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే త్రాగునీటి వసతి, పార్కింగ్, తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాట్లకు కూడా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను సూచించారు. దేవస్థాన పరిధిలో ముఖ్యమంత్రి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీలు దేవస్థాన ఈఓతో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ జెట్ ను పరిశీలించారు. ల్యాడర్ కు డెకరేషన్ చేయాలన్నారు. రోప్ వే భవనం, క్యాబిన్, నడకదారుల్లో ముమ్మర పారిశుధ్య చర్యలు చేపట్టి పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు. ఏర్పాట్లలో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రోప్ వే పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ, దేవస్థాన అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్లాస్టిక్ జెట్ ఏర్పాటుతో పాటు ల్యాడర్ కు డెకరేషన్, రోప్ వే భవనం, క్యాబిన్,నడకదారుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు.

# ప్రజల ఆరోగ్యంపై ఈనెల 14 నుంచి ఎన్సీడీసీ ఇంటింటా సర్వే

**బాపట్ల,తెలంగాణ ముచ్చట్లు :** ప్రజల ఆరోగ్యంపై ఈనెల 14 నుంచి ఎన్సీడీసీ ఇంటింటా సర్వే చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై డివిజన్ మండల స్థాయి అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఇంటింటా ఎన్సీడీసీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే వ్యాధులు గాకుండా తమ దురలవాట్ల ద్వారా వచ్చే జబ్బులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తద్వారా అనారోగ్యానికి గురై అర్ధాయుష్షుతో కొందరు కాలం చేస్తున్నారని వివరించారు. అలాంటి వారిని గుర్తించి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించిందన్నారు. వారి జీవన పరిమాణం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. 50 ప్రశ్నావళితో సర్వే జరుగుతుందని ప్రజలు సహకరించాలన్నారు. ముఖ్యంగా క్యాన్సర్, బీపీ, మధుమేహం, గుండె జబ్బులు వంటి వాటిని గుర్తించాలన్నారు ఏఎన్ఎంలు, ఎం ఎల్ హెచ్ పి లు సర్వేలో పాల్గొంటారన్నారు. ప్రతి ఒక్కరి శరీరం వారంలో కనీసం 150 నిమిషాలు శారీరకంగా శ్రమించాలనే విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలను చైతన్య పరచటం చాలా ముఖ్యమన్నారు. ఎలాంటి భోజనం తీసుకుంటే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందో అవగాహన కల్పించాలన్నారు. కౌమార దశలోని బాలికలలో రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలను అధిగమించడంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనులలో అర్హులైన పేదలందరికీ ఉపాధి చూపాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. 2.64లక్షల మందికి జాబ్ కార్డులు ఇచ్చినప్పటికీ వారందరికీ పూర్తిస్థాయిలో ఉపాధి చూపాలన్నారు. నిరుపేదలకు ఉపాధి కల్పించేలా పనులు గుర్తించాలని, ముఖ్యంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తీర ప్రాంతాల వద్ద పండ్ల మొక్కలు, తదితరమైన మొక్కలు నాటి అటవీ సంపదను విస్తరింప చేయడానికి కృషి చేయాలన్నారు. పరిశ్రమల స్థాపన, తదితర అభివృద్ధి కార్యక్రమాల కొరకు అవసరమైన భూమి, స్మశాన భూములను గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. సర్వేలో నిర్లప్తంగా వ్యవహరించే వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్, తహసిల్దార్ లపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెవిన్యూ అధికారులు విధులలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఉచిత ఇసుక విధానం అమలులో ఉన్నందున ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా ఉంటే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వంతెనలు తాగునీటి ట్యాంకుల వద్ద అక్రమంగా తవ్వకాలు జరిగితే ఊరుకునేది లేదన్నారు. భూముల రీ సర్వే వేగంగా ప్రారంభించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. జిల్లాకు 1.6 లక్షల సర్వే హద్దు రాళ్లు వచ్చాయన్నారు. అవసరమైన చోట హద్దులు చూపి వాటిని నాటాలన్నారు. రీ సర్వేపై వస్తున్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ పై అర్జీలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం గాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉదయగిరి జిల్లా సాధన తోనే మెట్ట ప్రాంతం అభివృద్ధి

## - జిల్లా సాధన కమిటీ అధ్యక్షులు డాక్టర్ వేణు గోపాల్




**దుత్తలూరు/ఉదయగిరి, తెలంగాణ ముచ్చట్లు :** ఉదయగిరి జిల్లా ఏర్పాటుతోన్నె మెట్ట ప్రాంతం అభి వృద్ధి చెందుతుందని ఉదయగిరి జిల్లా సాధన కమిటీ అధ్యక్షులు డాక్టర్ వేణు గోపాల్ తెలిపారు. ఉదయగిరి జిల్లా సాధన కోసం ఉదయగిరి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నుండి ఉదయగిరి జిల్లా సాధన కమిటీ ఆద్వర్యంలో బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీ లయ్యిన టీడిపి,వైఎస్సార్ పార్టీ,బిజెపి,సీపీఎం,జన సేన నాయకులు,వ్యాపార వేత్తలు,ఉద్యోగులు,అన్ని కుల సంఘాల నాయకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గోన్ని ఉదయగిరి జిల్లా ఏర్పాటు చెయ్యాలని నినాదాలు చేశారు. ఉదయగిరి జిల్లా ఏర్పాటు చెయ్యక పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. తర తరాలుగా ఉదయగిరి ప్రాంతం వెనుక బాటుతనం కు గురిఅయ్యినదని తెలిపారు. ఉదయగిరి ప్రాంతంలో నాణ్యమైన విద్య,వైద్య సదుపాయాలు లేవని తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రం నెల్లూరు కు సరైన రోడ్డు మార్గం లేదని తెలిపారు. అత్యవసర వైద్య సదుపాయం కోసం నెల్లూరు వెళ్లాలంటే అర్ అండ్ బి రొడ్డులు నరకం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# అప్పు ఆ కుటుంబం పాలిట శాపమైంది

హైదరాబాద్, నవంబర్ 7 : చేసిన అప్పు ఓ కుటుంబం పాలిట శాపంగా మారింది. అప్పుల వాళ్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ న్యాల్ కల్ రోడ్డులో నివాసం ఉండే వేణు(50) చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య అనురాధ, కూతురు పూర్ణిమ (24) ఉన్నారు. కాగా, వ్యాపార నిమిత్తం స్థానిక వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్ వద్ద రెండేళ్ల కింద రూ.3 లక్షల అప్పు తీసుకున్న వేణు మొత్తానికి వడ్డీతో సహా అసలు చాలావరకు కట్టాడు. అయినా వడ్డీ, చక్రవడ్డీల కింద జమ చేసి ఇంకా అప్పు కట్టాలని లేదంటే భార్యాకూతుళ్లను అందరిలో వివస్త్రలను చేస్తామని బెదిరించారు. దీంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులు తట్టుకోలేక వేణు కుటుంబం బాసర వద్ద గోదావరిలో దూకారు.

# సినిమా న్యూస్



# మండే ఎండలో సికిందర్ బ్యూటీ మరింత హీటెక్కించేలా!



బాలీవుడ్ హాట్ బ్యూటీ శామా సికిందర్ ఇన్ న్ స్టా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నిత్యం డిజైనర్ దుస్తుల్లో శామా సెగలు నె ట్టింట చర్చకొస్తుంటాయి. ఎలివేషన్ లో తనదైన మార్క్ తప్పనిసరి. హీటెక్కించే ఘాటు ఫోజులతో కుర్రకారుని అలరించడం అమ్మడి ప్రత్యేకత. డిజైనర్ దుస్తులేసినా.. సంప్రదాయ దుస్తులైనా షామా అందానికి కుర్రాళ్లంతా ఫిదా అవ్వాల్సిందే. మార్కెట్ లో పోటీని తట్టుకుని నిలవాలంటే? ఆ మాత్రం తప్పదంటూ ముందుకు సాగిపోతుంది. సినిమా ఛాన్సులు తగ్గినా ఇంకా మీడియాలో ఫాంలో కనిపిస్తుందంటే? కారణం ఈ రకమైన ఎలి వేషన్లు అనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజాగా అమ్మడు భగ భగ మండే ఎండలో నలుపు చీరలో తళుక్కున మెరిసింది. ప్రకాశ వంతమైన ఎండ తీవ్రతకు షామా స్కిన్ టోన్ మరింత మెరిసిపోతుంది. భానుడి భగ భగ మధ్య అంత్యంత కష్టమైన ఫోటో సెషన్ ఇది. ఓ వైపు సూర్యారావు ప్రతాపం..మరోవైపు ఆ వేడి కారణంతో చీర మరింత పొగలు కక్కడం మధ్య ఫోటో షూట్ అంటే కత్తి మీద సాము లాంటిది. అయినా సికిందర్ బ్యూటీ ఎలివేషన్ పరంగా ఏమాత్రం తగ్గలేదు. సొగసరి అలంకరణ ప్రతీది శామిని మరింత అందంగా తీర్చిదిద్దాయి. పవిట అంచును అల్లా చేతితో గాల్లోకి ఎత్తి నవ్వుతూ కెమారాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నె ట్టింట వైరల్ గా మారాయి. ఈ ఫోటోకి ఇలా ట్యాగ్ లైన్ ఇంచ్చింది. మెయిన్ తేహ్రీ రాహి, జమీన్ చల్నే లగీ అంటూ లవ్ సింబల్స్ జోడించింది. శామా చీరందానికి యువత ఫిదా అవుతుంది. తమదైన శైలిలో ప్రపోజల్స్ గుప్పిస్తున్నారు. ఇక షామా కెరీర్ సంగతి చూస్తే ప్రేమ్ అగాన్ సినిమాతో బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మన్‌ది డెడ్లీ పార్ట్..బస్తీ దూమ్ ధడాకా కాంట్రాక్ట్ .సెక్సాహెూలిక్ లాంటి సినిమాల్లో నటించింది. బ్యూటీ చివరిసారిగా నటించిన బైపాస్ రోడ్ రిలీజ్ అయి మూడేళ్లు అవుతుంది. అప్పటి నుంచి కొత్త అవకాశాలేవి అందుకోలేదు.

# చీరకట్టులో అయేషా ఖాన్ సింగారం



నార్త్ ఇండియన్ భామ అయేషా ఖాన్ కి సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె బాలవీర్ అనే సీరియల్ తో నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. తరువాత హిందీ బిగ్ బాస్ 17లో కంటిస్టెంట్ గా పార్టిసిపేట్ చేసింది. ఆ తరువాత అయేషా ఖాన్ కి మంచి ఇమేజ్ వచ్చింది. గ్లామర్ ఫోటోషూట్ లతో ఈ బ్యూటీ అందరికి చేరువ అయ్యింది. 'ముఖచిత్రం' సినిమాతో అయేషా ఖాన్ టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టింది. తరువాత 'ఓం భీమ్ బుష్' సినిమాలో ఒక హీరోయిన్ గా కనిపించింది. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రంలో ఐటెం సాంగ్ తో అయేషా ఖాన్ మరింతగా అందరి దృష్టిని ఆకర్షించింది. శర్వానంద్ 'మనమే', దుల్కర్ సల్మాన్ 'లక్కీ భాస్కర్' సినిమాలలో కూడా అయేషా ఖాన్ నటించింది. ఈ బ్యూటీ హీరోయిన్ గా అదిరిపోయే ఒక కమర్షియల్ సక్సెస్ కోసం వెయిట్ చేస్తోంది. స్టార్ హీరోయిన్ అయ్యే ఫీచర్స్ అయేషా ఖాన్ కి పుష్కలంగా ఉన్నాయని ఆమెని ఫాలో అయ్యేవారు చెప్పే మాట. ఇదిలా ఉంటే ఈ బ్యూటీకి ఇన్ స్టాగ్రామ్ లో ఏకంగా 5.4 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు.



# కూతురిని చూస్తూ ఎమోషనల్ అయిన స్టార్ హీరోయిన్

బాలీవుడ్ స్టార్ కపుల్ రణబీర్ కపూర్-అలియా భట్ ల గారాల కూతురు రాహా కపూర్ ఈరోజుతో 2వ ఏట అడుగుపెట్టింది. ఈ మరపురాని రోజున... అలియా ఇన్‌స్టాలో తన చిన్నారి రాహా గురించి రాస్తూ ఎంతో ఉద్వేగానికి లోనయింది. ఈరోజుకి 2 సంవత్సరాలు.. కొన్ని వారాల చిన్ని పాపగా ఉన్నప్పుడే నేను నీకు విష్ చేసాను!!! కానీ అది మనం ఉన్న చోటు నుంచి పుట్టే ఉద్వేగం.. ఒకసారి తల్లితండ్రులైతే మీ బిడ్డ ఎప్పటికీ మీ బిడ్డగా ఉండాలని కోరుకుంటారు... పుట్టినరోజు శుభాకాంక్షలు. అని రాసారు. ప్రతిరోజూ బర్త్ డే కేక్ తోనే అన్న ఫీల్ కలిగించావని కూడా ఆలియా ఎమోషనల్ అయింది. చిన్నారి రాహాతో కలిసి ఉన్న ఒక త్రోబాక్ ఫోటోని కూడా ఆలియా షేర్ చేసింది. దీనిలో చిన్ని రాహాను తన చేతుల్లోకి తీసుకుంటున్నప్పుడు రణబీర్ తననే ఆత్రుతగా చూస్తూ కనిపించాడు. కొన్నేళ్ల పాటు డేటింగ్ చేసిన తర్వాత రణబీర్-అలియా జంట పెద్దల ఆశీస్సులతో 14 ఏప్రిల్ 2022న పెళ్లితో ఒకటయ్యారు. రణబీర్ నివశించే ముంబై ఇంట్లో సింపుల్ ఎఫైర్ గా ఈ పెళ్లి జరిగింది. స్టార్ కపుల్ 6 నవంబర్ 2022న రాహాను స్వాగతించారు. పలు ఇంటర్వ్యూలలో.. ఆలియా రాహాకు జన్మనిచ్చిన తర్వాత రాత్రిపూట తన జీవితం ఎలా మారిందో వివరించింది. ఆనందం బాధ ఉద్వేగం ఇలా అన్నిటినీ అనుభవించానని తెలిపింది.

# పింక్ డ్రెస్‌లో అదరగొట్టిన యువ నాయిక

శాన్వి శ్రీవాస్తవ ప్రధానంగా కన్నడ, తెలుగు చిత్ర పరిశ్రమలలో పాపులర్ నటి. 2014 హర్రర్-కామెడీ చిత్రం 'చంద్రలేఖ'తో కన్నడ చిత్ర పరిశ్రమలో తన నటనా వృత్తిని ప్రారంభించింది. ఈ సినిమాలో శాన్వి దెయ్యం పట్టిన యువతి పాత్రలో నటించింది. మరుసటి సంవత్సరం శాన్వి తన ప్రతిభకు గుర్తింపు పొందడంతో పొరుగు భాషల్లో అవకాశాలు వచ్చాయి. 2015లో ఆమెకు సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్ లభించింది. మంజు మాండవ్య దర్శకత్వం వహించిన 'మాస్టర్ పీస్' చిత్రంలో ఆమె పాత్రకు కన్నడ - ఉత్తమ నటిగా ప్రతిష్టాత్మక ఫిల్మ్‌ఫేర్ అవార్డుకు ఎంపికైంది. తారక్ చిత్రంలో ప్రతిభ గల నటిగా పేరు తెచ్చుకుంది. శాన్వి కన్నడ ఫిలింఫేర్ ఉత్తమ నటిగా నామినేట్ అయింది. కన్నడ పరిశ్రమ నుంచి ఉత్తమ నటిగా అవార్డును గెలుచుకుంది. శాన్వి తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా నిరంతరం వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. ఇన్‌స్టాలో తన ఫ్యాషన్ సెన్స్, లుక్‌లతో అభిమానులను ఎగ్జయిట్ చేస్తోంది. అలాంటి ఒక ఫోటోలో షాన్వి అందమైన పింక్ డ్రెస్‌లో కనిపించింది. "నేను జీవితంలో ఈ మూడ్ కలిగి ఉండగలనా" అని దీనికి క్యాప్షన్ ఇచ్చింది.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in